J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 13.11.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 24 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerpatrika.com

## బిహార్ బిజెపి



### ఉప ఎన్నికలలో
# మోడి ప్రభంజనం



## తెలంగాణలో 'బండి'పై కమలం

## ➤ తలక్రిందులైన మీడియా అంచనాలు

బిహార్‌లో జెడియుతో కలిసి పోటీ చేసినా అత్యధిక సీట్లు సాధించిన అతి పెద్ద పార్టీగా భాజపా ముందుస్థానంలో నిలిచింది. ఇక్కడ నితీష్‌కుమార్ నాయకత్వంలోని జెడియు కంటే కమలానికే ఎక్కువ స్థాయిలో ఈసారి బిహార్ ప్రజలు జైకొట్టారు. వరుసగా మూడు పర్యాయాలుగా బిహార్‌ని పాలిస్తున్న నితీష్ పార్టీతో చేతులు కలిపిన కమలదళానికన్నా ఆ స్నేహం జెడియుకె ఎక్కువగా కలిసొచ్చింది. గతంలో జెడియు వల్ల బిజెపి లాభపడితే ఈసారి సీన్ రివర్స్ అయ్యింది.

బిహార్‌లో జెడియు – భాజపా కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు

**భారతావనిలో 'నమో' నామం మరోసారి మారుమోగింది. బిహార్ శాసనసభ ఎన్నికలతో పాటు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాలలో జరిగిన ఉప ఎన్నికలలో అన్నిచోట్లా బిజెపి బ్రహ్మాండమైన ఫలితాలను సాధించింది. ఆరున్నర సంవత్సరాల నరేంద్రమోడీ పాలనకు నీరాజనాలు పలుకుతూ ఈ ఎన్నికలలో సైతం ఓటర్లు పెద్ద ఎత్తున బిజెపికి మద్దతుగా నిలిచారు.**

అవసరమైన మెజార్టీ సాధించింది. ఈ ఎన్డీఏ కూటమికి 125 స్థానాలు వస్తే, 'మహాకూటమి' గట్టి పోటీ ఇచ్చినప్పటికీ 110 స్థానాల వద్దే ఆగిపోయింది. బిహార్ ఎన్నికలతో పాటు ఉపఎన్నికలు జరిగిన 11 రాష్ట్రాల్లో భాజపా అత్యధిక స్థానాలు గెలుచుకోవడంతో మోడీ ప్రభంజనం ఎంత విస్తృతంగా ఉందో తేటతెల్లమవుతోంది.

దేశ సరిహద్దుల్లో తరచూ చోటు చేసుకుంటున్న ఉత్కంఠకర పరిణామాలను సమర్ధవంతంగా ఎదుర్కోవడంలో చూపిస్తున్న సమర్ధత, భారతీయుల చిరకాల కోరికగా మిగిలిపోయివున్న రామమందిర నిర్మాణానికి భూమిపూజ చేసి భారతీయుల హిందుత్వ సెంటిమెంట్లను కాపాడడం వంటి అంశాలలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని కమల దళం తీసుకుంటున్న నిర్ణయాలూ, ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనాని సమర్ధవంతంగా ఎదుర్కొనడంలో మోడీ ప్రభుత్వం (మిగతా 11వ పేజీలో)

### పునర్విభజనలో...
# సర్వేపల్లి నెల్లూరుకే!
### • జిల్లావాసులకు కొంత ఊరట



రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజన కార్యక్రమంలో భాగంగా, సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాలతోపాటు సర్వేపల్లి నియోజకవర్గం కూడా తిరుపతి(బాలాజీ) జిల్లాలో కలిసిపోతుందని గతంలో అనేక వార్తలు, ఊహాగానాలు వచ్చాయి. (మిగతా 11వ పేజీలో)




# పెరిగిన ప్రతిష్ట



### పిఎస్ఎల్‌వి-సి49 సక్సెస్
### ఒకేసారి నింగిలోకి 10 ఉపగ్రహాలు

ఏకంగా పది ఉపగ్రహాలు అంతరిక్షంలోకి రివ్వుమంటూ దూసుకుపోయాయి. ఉరుములు మెరుపులతో వాతావరణం పెద్దగా అనుకూలించనప్పటికీ విభిన్నమైన వాతావరణంలో కూడా పిఎస్ఎల్‌వి–సి49 సూపర్ సక్సెస్ కావడంతో ఒక్కసారిగా ఇస్రో శాస్త్రవేత్తల్లో సంతోషం నెలకొంది. అందులోనూ ఒకే రాకెట్‌తో ఏకంగా 10ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టడం మరో విశేషం. దేశప్రజలంతా ఎంతో ఉత్కంఠగా టీవీల్లో ఈ ప్రయోగాన్ని చూస్తూ, రాకెట్ ప్రయోగం సక్సెస్ కావడంతోనే సంతోషంతో కరతాళధ్వనులు చేశారు. (మిగతా 8వ పేజీలో)



### ఒక్క రాత్రి వానొచ్చింది...

# నగరమంతా.. ఏరయ్యింది

## ➢ సంచారి మేలుకోమన్నాడు... అధికారులు నిద్రపోతున్నారు



స్వచ్ఛ నెల్లూరు అంటే ఇదే కాబోలు!


అసలే కరోనా నామ సంవత్సరం .. ఆ పై నవంబరు వస్తోంది

ముందే మేలుకోండి

పబ్లిక్ డిమాండ్

లాయర్ వారపత్రిక నెల్లూరు 23.10.2020

'లాయర్' అక్టోబర్ 23వతేదీ సంచికలో పబ్లిక్ డిమాండ్ శీర్షిక ద్వారా 'నవంబర్ వస్తోంది... ముందే మేలుకోండి' అంటూ హెచ్చరించిన సంచారి


నెల్లూరు బంజారాహిల్స్‌గా పేరుబడ్డ మాగుంట లే అవుట్ రోడ్ల దుస్థితి


ఇది చెరువనుకునేరు... కాదు, కాదు నగరంలోని ఓ కాలనీ


ఇది నీటి గుంట కాదు ఉమ్మారెడ్డిగుంట

**2015**లో ఇదే కలెక్టర్ అప్పుడు కమిషనర్‌గా వున్నాడు. ఇదే శాసనసభ్యులు అప్పుడూ ఉన్నారు(కాకపోతే అప్పుడు అధికారం వీళ్లది కాదు). ఇప్పుడు నగర యంయల్‌ఏ మంత్రిగా కూడా ఉన్నాడు, కానీ పరిస్థితులు మాత్రం మారలేదు.

'లాయర్' అక్టోబర్ 23వ తేదీ సంచికలో "నవంబర్ వస్తోంది... ముందే మేలుకోండి" అంటూ పబ్లిక్ డిమాండ్ శీర్షికలో సంచారి డిమాండ్ చేశాడు కూడా. మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అధికారులతో సమీక్ష జరిపి హెచ్చరించడం కూడా జరిగింది. కానీ అధికారులు మాత్రం మేల్కోలేదు. నవంబర్11, బుధవారం రాత్రి కురిసిన వానకి నగరం ఏరయ్యింది, రోడ్లపైకి నీరోచ్చింది, నగరవాసులకు కష్టమొచ్చింది, 2015 పునరావృతమయ్యింది. ఒక్క రాత్రి వానకే ఇలా అయితే, మరి హైదరాబాదులో ఇటీవల కురిసినట్టు ఒక వారమంతా ఎడతెరిపి లేకుండా వర్షం వస్తే నెల్లూరోళ్ళ పరిస్థితి ఏందో...? ఆమ్మో తలుచుకుంటేనే భయమేస్తుంది. గురువారం ఉదయానికి ఆత్మకూరు బస్టాండు, మాగుంట లే అవుట్ అండర్ బ్రిడ్జిలు నిండిపోయాయి, రామలింగాపురం అండర్ బ్రిడ్జి మూడవ రైల్వే లైను కోసం మూసేసింది. మరి ఇంక ట్రాఫిక్ కష్టాలైతే వర్ణనాతీతం. ప్రకటనలిస్తున్నారు.. కోట్లు తెస్తున్నారు.. దొరికిన మేరకు దోచుకుని దాచుకుంటున్నారు. ఇప్పటి యువనాయకులన్నా ఈ నగరానికి విముక్తి కలిగించండి, ఘన చరిత్ర కలిగిన నెల్లూరుని కాపాడండి... ఫియర్ ఫ్రీ(భయం లేని) నగరంగా తీర్చిదిద్దండి!.

### కరోనాతో
## మరొకరు మృతి

గత కొద్దిరోజులుగా జిల్లాలో కరోనా వ్యాధి ఉధృతి తగ్గుతూ ఉంది. వ్యాధికి గురైన వారి సంఖ్య గతంలో భారీగా ఉండేది. ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతోంది. ఈనెల 11న ఒక్కరోజే జిల్లాలో 4287 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 89 మందికి పాజిటివ్ వచ్చింది. ఇప్పటికే చికిత్స పొందుతున్న వారిలో 88 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారు. ఒకరు మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 568కి చేరింది. బుధవారం నాటికి జిల్లాలో మొత్తం 62,174 మంది కోవిడ్ బారిన పడగా, అందులో 60,186 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారు. మిగిలిన 1420 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు

ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి ఎన్నో పథకాలు చేపడుతోందని, వాటిని ప్రజలకు వివరించేందుకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని జిల్లా బిజెపి అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ అన్నారు.

ఈనెల 8న ఆయన కోవూరు నియోజకవర్గంలో జరిగిన నియోజకవర్గ స్థాయి సంస్థాగత శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. దేశ అభివృద్ధికి, ప్రజల అభ్యున్నతికి బిజెపి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ 17నెలల కాలంలో రాష్ట్రం సాధించిన అభివృద్ధి ఏమీ లేదని, కేంద్రం అందిస్తున్న నిధులను దారిమార్చి దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు.

కన్వీనర్ ఇండ్ల రాఘవేంద్రరెడ్డి సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సురేంద్రరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, మారుబోయిన శ్రీనివాసులు, మిడతల రమేష్, రఘురామయ్య, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక రికవరీ భేష్!..

# వృద్ధి బాటలో జీడీపీ!

- ఆర్థిక పురోగతికి 'ఆత్మనిర్భర్ భారత్-3'
- 10 రంగాలకు ప్రోత్సాహకంగా 1,45,980 కోట్లు

**- ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి**



కోవిడ్-19 కారణంగా ఈ ఏడాది తొలి రెండు త్రైమాసికాలలో జీడీపీ నీరసించినప్పటికీ మూడో క్వార్టర్(అక్టోబర్- డిసెంబర్) నుంచి వృద్ధి బాట పట్టనున్నట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈనెల 12వతేది గురువారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్థిక మంత్రి మాట్లాడుతూ జీడీపీ వృద్ధిపై ఆర్‌బీఐ తాజాగా అంచనాకు వచ్చినట్లు తెలియజేశారు. ఇటీవల కనిపిస్తున్న డిమాండ్ తాత్కాలికమైనది కాదని..ఇకపైనా పటిష్టంగా కొనసాగుతుందని అభిప్రాయపడ్డారు. ఇందుకు నిదర్శనంగా వెల్తువెత్తిన జీఎస్‌టీ వసూళ్లు, గత నెలలో 12 శాతం పెరిగిన విద్యుత్ వినియోగం, రోజుకి 20 శాతం వృద్ధి చూపుతున్న రైల్వే సరుకు రవాణా, కొత్త రికార్డులను సాధిస్తున్న స్టాక్ మార్కెట్లు తదితరాలను ప్రస్తావించారు. విదేశీ మారక నిల్వలు సైతం రికార్డ్ స్థాయిలో 560 బిలియన్ డాలర్లను తాకినట్లు తెలియజేశారు. గత 11 రోజులుగా పటిష్ట రికవరీ కనిపిస్తున్నట్లు తెలియజేశారు. ఆర్థిక పురోగతికి చేయూతనిచ్చేందుకు సహాయక ప్యాకేజీలో భాగంగా ఆత్మనిర్భర్-3ను ప్రకటించారు. ఆత్మనిర్భర్ తయారీ పథకంలో భాగంగా 10 చాంపియన్ రంగాలకు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలను అందించనున్నారు. ఈ పథకం విలువ రూ. 1,45,980 కోట్లు అని ఆమె ప్రకటించారు. స్వావలంబన పథకంలో భాగంగా 12 రకాల చర్యలను ప్రకటించారు. ఆత్మనిర్భర్ భారత్ రోజ్‌గార్ యోజన పేరుతో పథకాన్ని ప్రకటించారు.

కోవిడ్-19 కారణంగా మార్చి- సెప్టెంబర్ మధ్య కాలంలో ఉపాధి కోల్పోయిన వారికి కొత్తగా ఉద్యోగ కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. రూ.15,000 కంటే తక్కువ వేతనాలు ఆర్జించేవారికి ఈ పథకం వర్తించనుంది. 2020 అక్టోబర్ 1 నుంచీ రెండేళ్లపాటు ఈ పథకం అమలులో ఉంటుంది. ఈఎల్‌సీజీ పథకంకింద రూ. 2.05 లక్షల కోట్లను కేటాయించామని, 61 లక్షల మంది రుణగ్రహీతలకు రూ. 1.52 లక్షల కోట్ల రుణాలు విడుదలయ్యాయని తెలిపారు. ఎరువుల సబ్సిడీ క్రింద రైతులకు 65,000కోట్ల రూపాయలను కేటాయించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలియజేశారు. 21 రాష్ట్రాలు పంపిన ప్రతిపాదనలమేరకు రూ. 1681 కోట్లను పీఎం మత్స్యసంపద పథకానికి కేటాయించామని వివరించారు.

## 21న ఫిషింగ్ హార్బర్‌కు శంకుస్థాపన

**మత్స్యశాఖ మంత్రి డాక్టర్ అప్పలరాజు**

ఈనెల 21వ తేదీన ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని బోగోలు మండలంలో ఉన్న జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేతులమీదుగా శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డా.సీదిరి అప్పలరాజు చెప్పారు. వైయస్ జగన్ ప్రజా సంకల్పయాత్ర పూర్తై మూడేళ్ళయిన సందర్భంగా ఈనెల 11న ఆయన కావలి నియోజకవర్గంలోని దగదర్తిలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలసి సంఘీభావ యాత్రలో పాల్గొన్నారు. సముద్ర తీరప్రాంతాల్లో మత్స్యకారులకు మౌలిక సదుపాయాలు కల్పించి వారి జీవనోపాధికి ఇబ్బందులు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి దృఢ సంకల్పంతో ఉన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్కాఫ్ ఛైర్మెన్ కొండూరు అనిల్‌బాబు, ఏఎంసి ఛైర్మెన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, వైకాపా దగదర్తి మండల కన్వీనర్ తాళ్ళూరు ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.




Please note the change

www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# ట్రాఫిక్ కష్టాలు తీర్చండి బాబోయ్...

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ నరకాన్ని తలపిస్తోంది. తరతరాలుగా అయ్యప్ప గుడి నుండి పెన్నా నది వరకూ ఒకే రోడ్డు వుంది. ట్రంకురోడ్డుగా ప్రసిద్ధి చెందిన ఈ రోడ్డు దశాబ్దాలు గడుస్తున్నా ఎదుగూ బొదుగూ లేకుండా అలాగే ఏడుస్తోంది. 1991లో నేదురుమల్లి జనార్థన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న తరుణంలో అక్కడక్కడా కొంత వెడల్పు చేశారు తప్ప ఆ తరువాత నాయకులెవరూ ఈ ట్రంకురోడ్డుని పట్టించుకున్న పాపానే పోలేదు. రోడ్డు వెడల్పు ప్రతిపాదన వచ్చినప్పుడల్లా నగర నాయకులకి ఓట్లు గుర్తొచ్చి రాజకీయానికే ప్రాధాన్యతనిచ్చారు తప్ప ప్రజల కష్టాలను గాలికి వదిలేశారు. ఇప్పుడు కొత్తగా మినీబైపాస్ రోడ్డు కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది, కానీ నగర వాసుల ట్రాఫిక్ కష్టాలు మాత్రం నానాటికీ తీసికట్టుగా తయారవుతున్నాయి. పెద్దాసుపత్రి వరకు పెద్దగా సమస్య ఉండదు. అక్కడినుండి యంజి మాల్, కిమ్స్ ఆసుపత్రి, మాగుంట సర్కిల్, ఆర్‌టిసి బస్టాండ్, నెహ్రూ బొమ్మ ప్రాంతం, విఆర్‌సి కూడలి, గాంధీబొమ్మ జంక్షన్, కనకమహల్, ఆత్మకూరు బస్టాండు ప్రాంతాలలో ట్రాఫిక్ వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. చాలా చోట్ల రోడ్డు వెడల్పు చేయడానికి ఆస్కారం వున్నప్పటికీ ఇక్కడ పాలిటిక్స్ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. గతంలో రోడ్ల వెడల్పు ప్రక్రియలో భాగంగా భవనాలపై మార్కింగ్ కూడా చేసినప్పటికీ రాజకీయ నేతల జోక్యంతో అవి ఆగిపోయాయి. ఇప్పటి నేతలైనా ఒత్తిళ్లకు లొంగకుండా ట్రంక్‌రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పబ్లిక్ డిమాండ్

### మినీ బైపాస్‌లో కూడా అదే పరిస్థితి...

రాజీవ్ రహదారిగా నామకరణం చేయబడిన మినీ బైపాస్‌గా ప్రసిద్ధి చెంది అయ్యప్ప గుడి నుండి ఆత్మకూరుబస్టాండు వరకు నగరానికి తూర్పువైపున శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మరో రహదారిలో సైతం క్రమేణా ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. భక్తవత్సల నగర్, కొండాయపాలెం కూడలి, అన్నమయ్య సర్కిల్, బెజవాడ గోపాలరెడ్డి బొమ్మ ప్రాంతాలతో పాటు రామలింగాపురం జంక్షన్లలో ట్రాఫిక్ చుక్కలు చూపిస్తోంది. రామలింగాపురం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మూడవ లైను పట్టాల నిర్మాణ పని జరుగుతుండడంతో అక్కడ రాకపోకలు నిలిపేశారు, అలాగే ముత్తుకూరు కూడలి వద్ద ఆర్‌ఓబి నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో రోడ్ల వెడల్పును కుదించేశారు, ఈ రెండుపనులు ఒకేసారి జరుగుతుండడంతో వాహన చోదకులు ఇబ్బందులు అన్నీ ఇన్నీ కాదు. అదుపు చేయడంచేతకాక రోడ్లను మూసేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యను తగ్గించాలంటే కొత్తగా రోడ్లను నిర్మించి కనెక్టివిటీ పెంచాల్సింది పోయి, ఉన్న రోడ్లను కూడా మూసేస్తున్నారు, నగరంలో కొన్ని చోట్ల ట్రాఫిక్‌ను అదుపు చేయడంలో విఫలమైన ట్రాఫిక్ పోలీసులు రోడ్లను మూసేశారు. ఇష్టానుసారం ట్రాఫిక్‌ను దారి మళ్లిస్తున్నారు. ఉదాహరణకు స్టోన్‌హౌస్‌పేటకు వెళ్లాలంటే ఊరంతా తిరిగి వెళ్ళాలి. మాగుంట విగ్రహం ప్రాంతంలో మళ్లింపులు పెట్టి ట్రాఫిక్కును అస్తవ్యస్తం చేసేశారు, ఇలా నగరంలో గత 10రోజులుగా ఎక్కడపడితే అక్కడ రోడ్లు మూసేసి, ట్రాఫిక్‌ను మళ్లించేసి ప్రజలకు పిచ్చెక్కిస్తున్నారు. ఒక ప్రణాళిక లేకుండా, ట్రాఫిక్ వ్యవస్థపైన అధ్యయనం చేసి అవగాహన తెచ్చుకోకుండా తమ ఇష్టానుసారం మూసివేతలు, మళ్లింపులు చెయ్యడంతో నగర ట్రాఫిక్ వ్యవస్థ నరకాన్ని తలపిస్తోంది. మంత్రులు మాత్రం చెవులు మార్మోగే సైరన్లతో రయ్యిమని వెళ్లిపోతున్నారు, బారికేడ్లను సైతం తొలగించి వాళ్ళ వాహనాలను అనుమతిస్తున్నారు. దీంతో ప్రజలు పడే బాధలు వాళ్లకు తెలియడం లేదు.

### ఆటోవాలాల దౌర్జన్యం...

ఆటోవాలాల ఆగడాలకు కూడా అదుపులేకుండా పోతోంది. ఎక్కడపడితే అక్కడ ఆపేస్తున్నారు. పరిమితిని మించి మందిని ఎక్కిస్తున్నారు, గట్టిగా ప్రశ్నిస్తే నీకు దిక్కున్న చోట చెప్పుకోమంటున్నారు. తమిళనాడు తరహాలో అధిక సంఖ్యలో ఆటోలు పోలీసు శాఖకు చెందినవారివే కావడంతో వారిని ప్రశ్నించే నాథుడు కరువయ్యాడు.

### మంత్రి స్పందించాలి...

మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ ఈ విషయంలో స్పందించాలి. ట్రాఫిక్ అధ్యయనం కోసం మేధావులతో కూడిన కమిటీని ఏర్పాటుచేసి వారి సలహాలు సూచనలతో సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలి. రోజురోజుకీ నగరంలో జనాభాతో పాటు వాహనాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిపోతోంది. రాబోయే 20 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటినుండే చర్యలు చేపట్టకపోతే ముందు ముందు పరిస్థితి మరీ దారుణంగా మారే ప్రమాదముంది.

- సంచారి

## శ్రీసిటీ మరో ముందడుగు

**- 'ఆల్‌స్టోమ్'లో 500వ మెట్రో రైలు బోగీ తయారీ**



శ్రీసిటీలో 'ఆల్‌స్టోమ్' మెట్రో రైళ్ళ తయారీ పరిశ్రమ మరో అరుదైన ఘనతను సాధించింది. అర్బన్ మెట్రో ప్రాజెక్టుల కోసం రోలింగ్ స్టాక్(మెట్రో రైళ్ళు)ను తయారుచేసే శ్రీసిటీ ఫ్యాక్టరీలో 500వ మెట్రో రైలు బోగీని తయారుచేసి విజయవంతంగా మరో మైలురాయిని అధిగమించింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో 'ఆల్‌స్టోమ్'కి సంబంధించిన అతిపెద్ద అర్బన్ రోలింగ్ స్టాక్ తయారీ విభాగం శ్రీసిటీలో ఉంది. ఇక్కడ నుంచి చెన్నై, కొచ్చి, లక్నో, ముంబై వంటి భారతీయ నగరాలే కాకుండా సిడ్నీ, మాంట్రియల్ తదితర ప్రపంచవ్యాప్త నగరాలకు కూడా మెట్రో రైళ్ళను సరఫరా చేస్తోంది. ఈ సందర్భంగా 'ఆల్‌స్టోమ్' ఇండియా, దక్షిణాసియా మేనేజింగ్ డైరెక్టర్ అలైన్ స్పోర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి వ్యాధి ధాటికి పరిశ్రమలకు, వ్యాపారాలకు అంతరాయం ఏర్పడినప్పటికీ తమ బృందాలు భద్రతలు పాటిస్తూ అవిశ్రాంతంగా పనిచేస్తూ మెట్రో కార్పొరేషన్‌లకు సకాలంలో ఉత్పత్తులను అందజేస్తున్నాయన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ఇది ఆల్‌స్టోమ్‌కి, శ్రీసిటీకి కూడా సంతోషకరమైన సందర్భమని తెలిపారు.


దీపావళి శుభాకాంక్షలతో...

కృష్ణచైతన్యలో సరికొత్త కోర్సులు

UGC గుర్తింపుతో నూతన డిగ్రీ, పీజీ, Ph.D కోర్సులు ప్రారంభం.

ఈ విద్యా సంవత్సరం 2020 - 21 నుంచి నెల్లూరు కృష్ణచైతన్యలో నైపుణ్యాభివృద్ధి మరియు ఉద్యోగ కల్పనతో UGC న్యూఢిల్లీ వారి గుర్తింపుతో డిగ్రీ, పీజీ & Ph.D కోర్సులు ప్రారంభించడం విద్యార్థులకు ఎంతో ప్రయోజనం.



• క్రొత్తగా ప్రారంభించిన DEGREE కోర్సులు
- BCA Data Science
- BCA Data Science & Data Analytics
- BCA Big Data & Machine Learning
- Computer Engineering & Data Science
- Computer Engineering & Data Analytics
- Artificial Intelligence, Machine Learning and IOT
- Certified Managment Accountant
- E-Commerce and Digital Marketing
- Agriculture and Horticulture

• క్రొత్తగా ప్రారంభించిన P.G. కోర్సులు
- Computer Engineering & Data science
- Computer Engineering Big Data & Machine Learning

• క్రొత్తగా ప్రారంభించిన Ph.D కోర్సులు
- Mathematics,
- CSE/Computer Engineering & Data Science
- Commerce & Management
- Chemistry

ఇట్లు : మేనేజమెంట్, కృష్ణచైతన్య డిగ్రీ & పీజీ కళాశాల, నెల్లూరు. ఫోన్: 9248748144, 9247033337

## 'ప్రభా'తం

# అమెరికా విజేత..బైడెన్



ఎంతో ఉత్కంఠభరితంగా ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో అమెరికా చివరికి బైడెన్‌కే జేజేలు పలికింది. ఇక అమెరికా సమస్యల కల్లోలం నుంచి బయట పడాల్సి ఉంది. అమెరికా అంతటా విజృంభిస్తున్న కోవిడ్ వైరస్‌ను తక్షణం అరికట్టేందుకు పెద్దఎత్తున ఆ మహమ్మారి వ్యాధితో యుద్ధమే చేయాల్సి ఉంది. అంతేకాదు అక్కడి పోలీసు వ్యవస్థను మరింతగా సంస్కరించి వర్ణ వివక్షకు తావులేని విధంగా అమెరికాను తీర్చిదిద్దాల్సి ఉందని అంతర్జాతీయస్థాయిలో అమెరికా తన ప్రతిష్టను మరింతగా పెంచుకునేందుకు ఇంకా అనేక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎంతో ఉత్కంఠభరితంగా, హోరాహోరీగా ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో అమెరికా చివరికి బైడెన్‌కే జేజేలు పలికింది. తనే గెలుస్తానని అందులో ఎలాంటి సందేహం లేదని అనుకుంటూ వచ్చిన డొనాల్డ్ ట్రంప్ ఎంతగా ధీమాగా ఉన్నా విజయానికి ఆమడదూరంలోనే చతికిలపడాల్సి వచ్చింది. ఇందుకు ప్రధాన కారణం ఆయన దుందుడుకుతనమేనన్నది లోకవిదితం. ఏ విషయాన్నీ పెద్దగా ఖాతరు చేయకపోవడం వారి లక్షణం. కరోనా మహమ్మారి విరుచుకుపడి అమెరికాలో లక్షలాదిమందిని పొట్టనపెట్టుకుంటూనే ఉన్నా, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఈ వ్యాధి గురించి భయాందోళనలకు గురవుతూ ప్రాణాలు అరచేత పట్టుకుని తగు జాగ్రత్తలు పాటించడంలో నిమగ్నమైనా.. 'అదేం చేయదులే' అన్నట్లుగా ఆయన నిర్లక్ష్యం వహించడాన్ని అమెరికన్లు జీర్ణించుకోలేకపోయారనేందుకు ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనంగా భావించవచ్చు. వాస్తవానికి ఒక్క కరోనానే కాదు, ఏ విషయాన్నీ ట్రంప్ పెద్దగా పట్టించుకోకపోవడమే ఆయన కొంపముంచిందని, ఒక్క మాటలో చెప్పాలంటే ట్రంప్ ఓటమి స్వయంకృతాపరాధమేనని విశ్లేషకుల అంచనా.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా, ప్రపంచాధినేతగా వ్యవహరిస్తున్న అగ్రరాజ్యం అమెరికా. ఈ ఎన్నికలు గతంలో ఎన్నడూ లేనంతగా నరాలు తెగే ఉత్కంఠ రేకెత్తిస్తూ జరగడం ఒక ఎత్తయితే, కరోనా నేపథ్యంలోనూ ఎవరికి ఎవరూ తీసిపోకుండా ట్రంప్-బైడెన్‌లు ఇద్దరూ పోటాపోటీగా బరిలోకి దిగడం మరో ఎత్తు. ఎట్టకేలకు తేలిన ఎన్నికల ఫలితాలతో.. డెమోక్రాట్ల అభ్యర్థిగా నిలిచిన డెబ్బైఏడేళ్ళ జోసఫ్ రాబినెట్ బైడెన్ జూనియర్‌కే అమెరికన్లు అగ్రాసనం ఇచ్చారు. ఎలక్టోరల్ కాలేజీలోని 538 ఓట్లకు గాను మ్యాజిక్ ఫిగర్ 270 కాగా, 284 ఓట్లు సాధించి బైడెనే విజేత అయ్యారు. దీంతో అమెరికా సంయుక్త రాష్ట్రాల 46వ అధ్యక్షునిగా జో బైడెన్ శ్వేతసౌధంలో అడుగుపెట్టేందుకు మార్గం సుగమమైనట్లే! అమెరికా ఉపాధ్యక్షురాలిగా దక్షిణ భారత మూలాలున్న కమలాహారిస్ ఎన్నిక కావడం ఒక చరిత్రాత్మక విశేషం. కాగా, ఎన్నికల ఫలితాలు బైడెన్ విజయాన్ని ధృవీకరిస్తున్నా, ఓటింగ్‌లో అక్రమాలు జరిగాయని, బైడెన్ గెలుపును ససేమిరా ఆమోదించేది లేదని డొనాల్డ్ ట్రంప్ మొండిగా వ్యవహరిస్తుండడం, అధికారమార్పిడి ప్రక్రియకు సహకరించకపోతుండడం ప్రపంచాన్నే విస్మయానికి గురిచేస్తున్న ట్రంప్ వైఖరి తెలిసినవారికి ఈ వ్యవహారం పెద్దగా కలవరపెట్టడం లేదు. బైడెన్‌కు ఇది కొంత ఇబ్బందికరమైన విషయం కూడా. ఏదేమైనా అమెరికా అధినేతగా..అగ్రరాజ్యాధినేతగా విజయం సాధించిన జో బైడెన్ ప్రపంచవ్యాప్తంగా అందరి అభినందనలు అందుకుంటూ ముందుకు సాగుతున్నారు. జనవరి 20వ తేదీన జో బైడెన్ అమెరికా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టనున్నారని కూడా ప్రపంచమంతా ఎదురుచూస్తోంది.

ఒకవైపు లక్షలాదిమంది ప్రజల ప్రాణాలను నిలువునా బలితీసుకుంటున్న మహమ్మారి కరోనా అమెరికాలో కోరలు చాస్తూనే ఉంది. కరోనా ధాటికి అమెరికా వణికిపోతోంది. మరోవైపు వర్ణ వివక్ష బలంగా వేళ్ళూనుకున్న అమెరికాలో ఇటీవలి కాలంలో ఘోరాలు నానాటికీ పెరుగుతూనే ఉన్నాయి. ఇంకోవైపు ట్రంప్ అనుసరించిన విభజన రాజకీయాలతో అమెరికా ఇంతకాలం సతమతమైంది. ఇప్పుడు తాజాగా బైడెన్ తన పాలనలో విభజన రాజకీయాలకు తావే ఉండదని చెప్తున్నా ఆచరణలో అమెరికా రాజకీయాల్లో పెరుగుతున్న అగాధాన్ని పూడ్చడానికి ఆయనెంతో కృషిచేయాల్సి ఉంది. బైడెన్‌కు ఇప్పుడు అన్నీ సవాళ్ళే. కరోనాను పూర్తిస్థాయిలో నివారించేందుకు సరికొత్త వ్యూహాన్ని అమలుచేయాల్సి ఉంది. అమెరికా అంతటా విజృంభిస్తున్న కోవిడ్ వైరస్‌ను తక్షణం అరికట్టేందుకు పెద్దఎత్తున ఆ మహమ్మారి వ్యాధితో యుద్ధమే చేయాల్సి ఉంది. అంతేకాదు అక్కడి పోలీసు వ్యవస్థను మరింతగా సంస్కరించి వర్ణ వివక్షకు తావులేని విధంగా అమెరికాను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాల్సి ఉంది. అంతర్జాతీయస్థాయిలో అమెరికా తన ప్రతిష్టను మరింతగా పెంచుకునేందుకు ఇంకా అనేక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ప్రపంచంలోనే అత్యున్నత శక్తిగా అవతరించాలని చైనా ప్రయత్నిస్తున్న ఈ తరుణంలో అమెరికా ఎప్పటికప్పుడు ఎంతో ముందు చూపుతో అడుగులు వేయాల్సి ఉంది.

ఇక భారత్ విషయంలో అమెరికా తీరు బాగానే ఉంటుందని, భారత్-అమెరికా సంబంధాలు వ్యూహాత్మక స్థాయికి చేరుకున్నందున పెద్దగా ఒడుదుడుకులేమీ ఉండకపోవచ్చని అనుకోవచ్చు. అమెరికన్ల అవకాశాలన్నిటినీ ఇతరులు దక్కించుకుంటున్నారంటూ ట్రంప్ హెచ్-1బి వీసాల విషయంలో దుడుకుగా వ్యవహరించి ఐటి పరిశ్రమలతో పాటు లక్షలాదిమంది ఔత్సాహికుల ఆశలను అడియాసలు చేయడం అందరికీ తెలిసిందే. అయితే, బైడెన్ రాకతో ఇక అలాంటి సమస్యలేమీ ఉండకపోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

'ఎంతో గొప్ప దేశమైన అమెరికాకి నాయకత్వం వహించడానికి నన్ను ఎన్నుకోవడం గౌరవంగా భావిస్తున్నా. మీరు నాకు ఓటేసినా, వేయకున్నా అందరు అమెరికన్లకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తా. నా లక్ష్యం చాలా కష్టమైంది. అయినప్పటికీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతా'.. నంటూ ఎన్నికల్లో విజయం అనంతరం తనను గెలిపించిన అమెరికన్లను ఉద్దేశించి జో బైడెన్ స్పష్టం చేశారు. తన అపారమైన రాజకీయ పరిజ్ఞానంతో, అద్వితీయమైన ప్రతిభాపాటవాలతో ఆ నమ్మకాన్ని బైడెన్ నిలబెట్టుకుంటారని అందరూ ఆకాంక్షిస్తున్నారు కూడా. ఆరుసార్లు సెనెటర్‌గా, ఒబామా హయాంలో రెండుసార్లు ఉపాధ్యక్షుడిగా జాతీయ రాజకీయాల్లో 5 దశాబ్దాల అనుభవం ఉన్న రాజనీతిజ్ఞుడుగా బైడెన్ ఎంతో ప్రసిద్ధిచెందారు. తన రాజకీయ అనుభవాన్నంతా రంగరించి అమెరికాను మరింత శక్తివంతంగా, ప్రపంచ దేశాలకు ఆదర్శవంతంగా నిలుపుతారని అమెరికన్లందరూ భావిస్తున్నారు. శ్వేతసౌధాదీశునిగా ఇక బైడెన్ త్వరలోనే అధ్యక్షపీఠం అలంకరించి అమెరికాను అగ్రపథాన నిలబెడతారని అందరూ ఎదురుచూస్తున్నారు.

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# సమాచార హక్కు చట్టాన్ని సమాధి చేస్తున్నారు!

ఎంతో కాలంగా ప్రజా ప్రతినిధులు.. ప్రజాస్వామ్య వాదులూ.. స్వచ్ఛంద సేవా సంస్థలు పోరాటాలు చేసి సాధించుకున్న సమాచార హక్కు చట్టాన్ని నెల్లూరు జిల్లాలో పూర్తిగా సమాధి చేస్తున్నారు. ఎన్నో అవినీతి భాగోతాలను వెలికి తీసి పారదర్శకతను పెంచేందుకు నిర్దేశించిన ఈ చట్టం కొంత మంది అధికారుల నిర్లక్ష్యం మూలంగా నిర్వీర్యమైపోతోంది.

సమాచార హక్కు చట్టంపై వేసిన అప్లికేషన్లు కొన్ని శాఖలలో బుట్టదాఖలు అవుతున్నాయి. పర్యవేక్షణ కరువై అడిగే దిక్కులేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పారదర్శకతను పెంచే ఈ చట్టం ప్రకారం స్వచ్ఛందంగానే కొంత సమాచారం ఇవ్వాలి. పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలి. కానీ ఎంతో శ్రమకోర్చి అర్జీలకు పోస్టల్ ఆర్డరు లేదా డీడీ జతకూర్చి రిజిస్టర్ పోస్టులో అభ్యర్ధించినా కొందరు అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరీ ముందుంది, నెలరోజులకు కుడా సమాధానం రాక పోవడంతో అప్పీలు వేసినా స్పందించడం లేదంటే నిర్లక్ష్యం ఎంతటి స్థాయిలో రాజ్యం ఏలుతుందో అర్ధం చేసుకోవచ్చు. ఒక అడ్వకేటు రెండో అప్పీలు వేసినా స్పందించలేదు. గతంలో ఒక రోగికి సంబంధించిన విషయాల గురించి వారి తండ్రి అర్జీ పెట్టుకుని రెండేళ్ళయినా ఇంతవరకూ సమాధానం శూన్యం.

సహ చట్టం ప్రకారం నెలరోజులలో అంటే 30రోజులలో సమాచారంతో కూడిన సమాధానం ఇవ్వాలి.. ఒక వేళ నిరాకరించడం జరిగినా ఆ విషయమైనా చెప్పాలి. కొన్ని కేసులలో అయితే గడువు ముగిసేలోగా ఏదో ఒక పొంతనలేని సమాధానం ఇచ్చి మమ అనిపిస్తారు. ఈ మద్య అదికూడా లేదు. మరి పారదర్శకత ఉన్నట్లా...? లేనట్లా ...?? ప్రజలే నిర్ణయించుకోవాలి. సమాచార పౌరసంబంధాల శాఖ పరిస్థితి మరీ ఘోరం. దేవాదాయ శాఖైతే పొంతనలేని తీర్పులను ఉటంకించి సమాధానం ఇవ్వకుండానే తప్పుకుంటోంది. అంటే దేవుడి సొమ్మును గుటకాయస్వాహా చేసినా అడగకూడదన్నది వీరి ధీమా.

అసలు నెల్లూరు జిల్లా కేంద్రంలో ఈ సహ చట్టం అమలులో ఉందా లేదా ...? అన్న అనుమానం కలుగుతుంది. .ఈ చట్ట ప్రకారం ఏదైనా ఉల్లంఘన జరిగితే సంబంధిత అధికారిని వ్యక్తిగతంగా బాధ్యులుని చేసి పెనాల్టీ చెల్లించేలా నిబంధనలు ఉన్నా కొందరు అధికారుల వైఖరి మాత్రం మారడం లేదు. మమ్మల్నేమి పీకలేరన్న




ధీమా వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లా అధికారులు వెంటనే ఈవిషయం పరిశీలించి సహ చట్టం అమలు చేయని శాఖలపై చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో న్యాయం కోసం కోర్టులను ఆశ్ర యించడమే ప్రజలకున్న ఏకైక మార్గం. పారదర్శకత మాటల్లో కాదు చేతల్లో చూపాలి.

ఇట్లు.. **జీవీ నాగరాజారావు,**
**న్యాయవాది, హైకోర్టు.**

# సంచలనాత్మకంగా మారిన అమెరికా ఎన్నికలు

ఈసారి జరిగిన అమెరికా ఎన్నికలు పెద్ద సంచలనంగా మారాయి. గతంలో జరిగిన ఏ ఎన్నికా ఇంతటి స్థాయిలో ఉత్కంఠతను రేకెత్తించలేదు. నాలుగేళ్ళ క్రితం అమెరికా 45 వ అధ్యక్షుడిగా ఎన్నికైన రోజునుండి ఎప్పుడూ ఏదో ఒక వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ డోనాల్డ్ ట్రంప్ నిత్యం వార్తలకెక్కుతూనే ఉన్నాడు. ఆ నోటి దూకుడే ఇప్పుడు ఆయన ఓటమికి కారణమయ్యింది.

మొట్టమొదటిసారిగా అమెరికాలోవున్న భారతీయులు సైతం ఈసారి ఎన్నికలలో రెండువర్గాలుగా విడిపోవడం గమనార్హం. జో బైడెన్‌కి డోనాల్డ్ ట్రంప్‌కి సమాంతరంగా ఈసారి భారతీయులు మద్దతు పలికినట్లు చెప్తున్నారు, గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. పోటీ చేసే వ్యక్తిని బట్టి రిపబ్లికన్ల వైపుగాని డెమోక్రిటిక్స్ వైపు గాని నిలిచే భారతీయ అమెరికా ఓటర్లు కూడా ఈ సారి రెండువర్గాలుగా విడిపోయి ఎన్నికలలో పాల్గొనడం విశేషం. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందనడానికి ఈ ఎన్నికలే ఉదాహరణ. తన పనితనంతో అన్ని వర్గాల ప్రజలని ఆకట్టుకున్న డోనాల్డ్ ట్రంప్ కేవలం అతి వాగుడుతో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. మళ్ళీ ట్రంప్ గెలిస్తే కరోనా మహమ్మారిని ప్రపంచానికి పరిచయం చేసిన చైనా దూకుడుకి చెక్ పెడతాడనుకున్న చాలామంది ఆశలు అడియాసలయ్యాయి.

**పి.యస్.రెడ్డి,**
**మెమ్ఫిస్, టెన్నెస్సీ, అమెరికా.**

# బిజెపికి కలసివస్తున్న 'రామ' నామ జపం

తాజాగా జరిగిన ఉపఎన్నికల ఫలితాలు చూస్తే నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ చేస్తున్న రామ నామ జపం కలిసివస్తుందనిపిస్తుంది. అయోధ్యలో రామమందిరానికి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన ఈ ఉప ఎన్నికలు ఆ పార్టీకి బాగా కలిసొచ్చాయి. ఆరున్నర సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉంటూ ఇప్పుడు జరిగిన ఈ బై ఎలక్షన్లలో కూడా ప్రజల మద్దతుని పొందగలగడం సామాన్య విషయం కాదు. ఇన్నాళ్లకు హిందుస్తాన్లో హిందుత్వ నినాదాన్ని వినిపిస్తున్న కాషాయ దళానికి జయహో అంటున్నారు భారతీయులు. ఉత్తర భారతదేశంలో తమ సత్తా చాటుకుంటున్న కమలనాథులు రాబోవు రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలపై తమ దృష్టి సారిస్తారేమో వేచి చూడాలి.

**– బి.నారాయణరెడ్డి, బెంగుళూరు.**

లాయర్

పాఠకులకు మనవి
మా(మీ) లాయర్ పత్రికకు
**సమాచారం / లేఖలు**
పంపదలచిన వారు
**9866314741** నంబరుకు
వాట్సయాప్ ద్వారా గాని, లేదా
lawyerpatrika@gmail.comకి
ఈ-మెయిల్ ద్వారా గాని
పంపవలసిందిగా విజ్ఞప్తి.
పోస్టల్ చిరునామా :
ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,
మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.
- సం/-

# నెరవేరిన చిరకాల కల

## - మెట్టప్రాంతాలకు వరంగా.. సోమశిల



ఎట్టకేలకు ఎంతోకాలంగా జిల్లాలోని మెట్టప్రాంత రైతులు చిరకాలంగా ఎదురుచూస్తున్న కోరిక నెరవేరింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ చొరవతో సోమశిల హైలెవన్ కెనాల్ ఫేజ్-2 పనులకు నిధులు మంజూరు చేయడమే కాక, ఈ పనులకు సిఎం జగన్మోహన్‌రెడ్డి ఈనెల 9న తాడేపల్లిలోని తన కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన కూడా చేయడంతో మెట్టప్రాంత రైతుల్లో సంతోషాతిరేకాలు వెల్లడవుతున్నాయి.



రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ చొరవతో జిల్లాలోని మెట్టప్రాంత రైతుల అభ్యున్నతికి బాటలు వేస్తూ ఈనెల 9న సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-2 పనులకు వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 నిర్మాణపనులు ఇప్పటికీ జరుగుతున్నాయని, ఇప్పుడు ఫేజ్-2 నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ రెండు దశల నిర్మాణాల పనులు పూర్తయితే ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు, ఆత్మకూరులతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు గ్రామాలకు కూడా తాగునీరు అందుతుందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల్లో అవినీతికి తావు లేకుండా ఉండాలని రివర్స్ టెండరింగ్‌కు వెళ్ళామని, సోమశిల హైలెవల్ ప్రాజెక్టులో రివర్స్ టెండరింగ్ ద్వారా దాదాపు 68 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఆదా చేశామని అన్నారు. తమది వ్యవసాయం విలువ, నీటి విలువ తెలిసన ప్రభుత్వమని అంటూ అన్నదాతలకు అన్నివిధాలా అండగా ఉంటామన్నారు.

### 2022 నాటికి పోలవరం పూర్తి - మంత్రి అనిల్

ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.పోలుబోయిన అనిల్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ 2022 ఖరీఫ్ సీజన్‌కల్లా పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేస్తామన్నారు. 2021 జనవరి నాటికి సంగం బ్యారేజీ, పెన్నా బ్యారేజీ పనులు పూర్తిచేస్తామని, కండలేరు కాలువ పనులు, సోమశిల ఉత్తరకాలువ పనులు ప్రారంభిస్తామని, వెలిగొండ ప్రాజెక్టు రెండు కాలువల పనులు కూడా ఏడాదిలోపు పూర్తిచేసి నీళ్ళందిస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే మెట్ట ప్రాంతాల్లో సుమారు రెండులక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. జిల్లాలోని వర్షాభావ ప్రాంతాలైన అనంతసాగరం, మర్రిపాడు, వింజమూరు, దుత్తలూరు, ఉదయగిరి, ఆత్మకూరు మండలాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సోమశిల జలాశయం నుంచి నీటిని ఎత్తిపోసి, తాగునీటి కష్టాలను తీర్చడంతో పాటు ఈ ప్రాంతాల్లోని సుమారు 90వేల ఎకరాలకు నీరందించేందుకు ఎస్‌హెచ్‌ఎల్ఎల్‌సి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు.

### ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం - మంత్రి గౌతంరెడ్డి

రాష్ట్రముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం అడిగిన వెంటనే సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-2 పనులకు నిధులు మంజూరుచేసి శంకుస్థాపన చేయడం గర్వకారణమని ఈ సందర్భంగా మంత్రి గౌతంరెడ్డి అన్నారు. తనతండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆశయాలకనుగుణంగా ఈ కార్యక్రమం జరుగుతుండడం సంతోషకరమన్నారు. 1999లో వెలిగొండ ప్రాజెక్టును నిర్మించాలని నాటి సిఎం చంద్రబాబును కోరగా అది ఉపయోగం లేదంటూ కొట్టివేశారని, కానీ అదే ప్రతిపాదనలకు 2004లో సిఎం డా.వైయస్ రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా దానికి 'వెలిగొండ ప్రాజెక్టు'గా నామకరణం చేసి, శంకుస్థాపనతో పాటు నిర్మాణపనులకు కూడా శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. అదేస్ఫూర్తితో ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో గతంలో అర్థాంతరంగా నిలిచిపోయిన ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటుండడం ఎంతో సంతోషకరమన్నారు.

జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ సుమారు 648.98 కోట్ల అంచనా వ్యయంతో సోమశిల హైలెవల్ లిఫ్ట్ కెనాల్ ఫేజ్-2 పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడంతో రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, జేసీ హరేందిర ప్రసాద్, వైకాపా నాయకులు రూప్‌కుమార్‌యాదవ్, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆప్కోబ్ ఛైర్మెన్ అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి నుండి..
## రాష్ట్రస్థాయికి పదవోన్నతి పొందిన

# సైకిల్ సైన్యం













తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీలో నెల్లూరుజిల్లాకి ప్రాధాన్యత కల్పించింది. చాలావరకు పార్టీ ఖాళీ అయిపోవడంతో మిగిలిన వాళ్ళని కాపాడుకునే క్రమంలో నెల్లూరు పార్లమెంటరీ నియోజక వర్గంలో కలిసే కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంతో కలిపి 13 మందికి పార్టీలో కీలక పదవులు కట్టబెట్టింది. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వలసపక్షి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిని, మాజీమంత్రి పరసా రత్నాన్ని నియమించింది. తెలుగుదేశం పార్టీ వేదికగా రాజకీయ ఆరంగేట్రం చేసి ఆ తరువాత ప్రజా రాజ్యంలోకి దూకి, అక్కడినుండి కాంగ్రెస్‌లోకి మళ్ళీ కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలోకి వచ్చి నగరంలో కాంట్రాక్టులన్నీ తమ సమీప బంధువు పేరుతో తనకే వచ్చేలా చేసుకున్న ముంగమూరు, ఇప్పుడు వ్యాపార దృక్పథమే ధ్యేయంగా తన మరో సమీప బంధువు ద్వారా వైసిపిలోకి జారిపోకుండా ఉపాధ్యక్ష పదవితో కట్టిపడేసింది. అయినా ఆయన వెళ్ళదలుచుకుంటే ఈ బంధాలు, బంధనాలు ఆయనకు పెద్ద అడ్డు కాదనుకోండి.

ఇకపోతే తన బాబాయ్ ఆనం వివేకానందరెడ్డి స్టైల్లో మీడియా వేదికగా ప్రజలని ఆకర్షించదగిన వాక్చాతుర్యం కలిగిన ఆనం ఫైర్ బ్రాండ్ వెంకటరమణారెడ్డిని రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధిగా నియమించింది.

నిత్య ఆశావాది పెళ్లకూరుశ్రీనివాసులరెడ్డిని రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిగా కొనసాగిస్తూ ఆయనకు తోడుగా ఆత్మ కూరుకు చెందిన గూటూరు మురళి కన్నబాబుని, కందుకూరుకు చెందిన దివి శివరాంని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా నియమించింది. ఇక రాష్ట్ర కార్యదర్శులుగా సుంకర అంజనాద్రి, బొమ్మి సురేంద్ర, బొమ్మన శ్రీధర్, జెన్ని రమణయ్య, దావా పెంచలరావు, వేలూరు రంగారావు, మొగిలి కళ్ళయ్యలను పార్టీ నియమించింది. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తూ ఈ నియామకాలను చేపట్టారు.

మాజీమంత్రి సీనియర్ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉండగా, యంయల్‌సి బీద రవిచంద్రను ఇటీవలే పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శిగా నియ మించిన సంగతి తెలిసిందే. నెల్లూరు పార్లమెంటు నియోజక ఇన్‌ఛార్జ్‌గా అజీజ్ భాయ్ వుండనే వున్నాడు.

మొన్నటి ఎన్నికలలో పోటీచేసి ఓడిపోయిన మాజీ శాసన సభ్యుడు పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డితో పాటు, నుడా మాజీచైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మాజీ మంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, మాజీ మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ వంటివారికి పార్టీ ప్రాధాన్యత కల్పించలేదు. వీళ్ళలో కొంతమంది నియోజక వర్గాల ఇన్‌ఛార్జులుగా వున్నారు కాబట్టి వారిని వేరే పదవులలో నియమించలేదన్నది కొందరు పార్టీ వర్గాల అభిప్రాయం. మరి తాళ్ళపాక దంపతులు ఎక్కడ ఇన్‌ఛార్జిలుగా ఉన్నారో వాళ్లే సమాధానం చెప్పాలి.

మొత్తానికి ఈ నియామకాలలో తెలుగుదేశం పార్టీ నాయకులకు పేరు చివర తోక దొరికింది. భవిష్యత్తులో తమ పార్టీ తరఫున పత్రికా ప్రకటనలు ఇవ్వడానికి తప్ప ఈ అలంకారాలు ఇంక దేనికి పనికి రావు, అల్ ది బెస్ట్ టు సైకిల్ సైన్యం!

## వీర జవాన్ల త్యాగాలను మరువరాదు




కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అమరులైన భారత వీరజవాన్లకు స్థానిక ఏవికె ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ పార్కు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఘన నివాళులర్పించారు. ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాశ్, కేతా సుబ్బారావు పాల్గొని అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. మృతి చెందిన వీర జవాన్లు ర్యాడా మహేష్, ప్రవీణ్ కుమార్‌రెడ్డిల త్యాగనిరతిని వారు ఈ సందర్భంగా కొనియాడారు. వీరజవాన్ల త్యాగాలను విస్మరించకూడదన్నారు. అమరవీరులను స్ఫూర్తిగా తీసుకుని యువతీయువకులు, విద్యార్థులు దేశ రక్షణకు తోడ్పడాలని కోరారు. ఈ కార్య క్రమంలో అరవ రాయప్ప, రామ్మోహన్, కృష్ణమూర్తి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## సంతోషం.. సంబరం...!



బిహార్ ఎన్నికల్లోనూ, దేశంలోని పలు రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికలలోనూ భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా సంబరాలు చేసుకుంటున్న జిల్లా బిజెపి శ్రేణులు

## 14 నుంచి సహకార వారోత్సవాలు

నవంబరు 14 నుంచి 20వ తేది వరకు జిల్లాలో సహకార వారోత్సవాలను నిర్వహిస్తామని జిల్లా సహకారశాఖ అధికారి తిరుపాల్‌రెడ్డి ఈనెల 11న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వారోత్స వాలు చేస్తామని, నెల్లూరు నగరంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో ఈనెల 14, డిసిఎమ్మెస్ కార్యాలయంలో 15న, నెల్లూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో 16న ఈ వారోత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

Please note the change

www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# నెల్లూరు కబుర్లు

## కార్తీకమాసం నేపథ్యంలో..
# భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి
**మంత్రి అనిల్**

కార్తీకమాసం సందర్భాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ఆలయ పరిసరప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మంత్రి డా.అనిల్‌కుమార్‌యాదవ్ ఆలయ అధికారులను ఆదేశించారు. నవంబరు 15 నుంచి డిసెంబరు 14వ తేదీ వరకు కార్తీకమాసోత్సవం నిర్వహణపై ఆయన ఈనెల 10న ఆలయంలో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్తీక మాసోత్సవ ఆహ్వానపత్రికలను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి అనిల్ మాట్లాడుతూ కోవిడ్ నేపథ్యంలో అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయంలో ప్రదక్షిణలు నిలుపుదల చేయడం జరిగిందని, భక్తులందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించి, భౌతికదూరం పాటిస్తూ కార్తీక దీపాలు వెలిగించాలని సూచించారు. పరమేశ్వరుని దయతో కరోనా నిర్మూలన జరిగి ప్రజలంతా హాయిగా జీవించాలని, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి రాష్ట్రాన్ని సుభిక్షంగా పాలించే శక్తినివ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, కమిషనర్ దినేష్‌కుమార్, డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి, వైకాపా నాయకులు ముక్కాల ద్వారకానాథ్, పి.రూప్‌కుమార్‌యాదవ్, కొండ్రెడ్డి రంగారెడ్డి, వందవాశి రంగా, గోగుల నాగరాజు, చాట్ల నరసింహారావు, నూనె మల్లికార్జునయాదవ్ ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘం సేవలు అభినందనీయం
**ముక్కాల ద్వారకానాథ్**

కోవిడ్ నేపథ్యంలో కుటుంబపోషణ భారమై ఇబ్బందులు పడుతున్న 125 మంది పేదకుటుంబాల వారికి ఈనెల 8న నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నెల్లూరులోని అర్బన్ ఆర్యవైశ్య సంఘం, ఫినోల్క్స్ ముకుల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం నేతృత్వంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం తమకెంతో సంతోషం కలిగిస్తోందన్నారు. ఈ సందర్భంగా ముక్కాల మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం సేవలను కొనియాడారు. అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట సూర్యనారాయణ, ఫినోలెక్స్ ఏపి ఎం.డి గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'బారాషహీద్ దర్గా-రొట్టెల పండుగ'
# పుస్తకావిష్కరణ



మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ ప్రాశస్త్యాన్ని వివరించే 'బారాషహీద్ దర్గా-రొట్టెల పండుగ' అనే పుస్తకాన్ని ఈనెల 10న నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రచయిత కురవి వెంకట కోటేశ్వరరావు రచించిన ఆ పుస్తకాన్ని నగరంలోని టూరిజం పార్కులో ప్రభుత్వ ఆసుపత్రి కమిటీసభ్యుడు ఎస్‌కె సత్తార్ ఆవిష్కరించారు. బారాషహీద్ దర్గా ప్రాశస్త్యం, రొట్టెల పండుగ విశిష్టతల గురించి వివరిస్తూ ఎంతో పరిశోధన చేసి మతసామరస్యానికి ప్రతీకగా ఈ పుస్తకాన్ని రచించడం జరిగిందని రచయిత తెలిపారు. ప్రముఖ కవి మోపూరు పెంచల నరసింహం అధ్యక్షతన జరిగిన ఈ పుస్తకావిష్కరణలో పెరసం కార్యనిర్వాహక కార్యదర్శి గోవిందరాజు సుభద్రాదేవి, ప్రధాన కార్యదర్శి అవ్వారు శ్రీధరబాబు, షేక్ షంషుద్దీన్, హస్తి లక్ష్మణరాజు, కె.వి ధనుష్ కుమార్, చంద్రమౌళి తదితరులు పాల్గొని రచయితను అభినందించారు.

# దీప కాంతులతోనే దీపావళి

**టపాసులు కాల్చొద్దు**
**- జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు**



ఈనెల 14న దీపావళిని పురస్కరించుకుని ఈసారి దీపావళి పండుగను దీపకాంతులతోనే ప్రశాంతంగా నిర్వహించుకోవాల్సి ఉంది. కరోనా నేపథ్యంలో ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి ఎవరిళ్ళలో వారు మట్టిప్రమిదలు వెలిగించి దీపావళి పండుగ చేసుకోవాలని, టపాసులు కాల్చొద్దని, పర్యావరణానికి ఎలాంటి హాని కలుగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ప్రజలకు సూచించారు. కరోనా మహమ్మారి వ్యాధి వల్ల ఇప్పటికే జిల్లాలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, ఇంకా ఎంతోమంది ఈ వ్యాధితో బాధలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రంజాన్, వినాయక చవితి పండుగలు చేసుకున్నవిధంగానే ఈసారి దీపావళి పండుగను కూడా ప్రశాంతంగా సంతోషంగా నిర్వహించుకోవాలన్నారు. కాగా, ప్రభుత్వ ఆదేశాలతో దీపావళికి బాణసంచా నిషేధిస్తున్నామని, బాణసంచా వేడుకలు నిర్వహిస్తే కోవిడ్ వైరస్ పెరిగే అవకాశం ఉన్నందున వీటిని ప్రభుత్వం నిషేధించిందన్నారు. జిల్లాలోని 49 టపాసుల గోడౌన్ల లైసెన్సులను రద్దు చేస్తున్నామని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వీటితోపాటు 18 రిటైల్ దుకాణాలకు ఇచ్చిన తాత్కాలిక లైసెన్సులను కూడా రద్దు చేస్తున్నామని, ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా టపాసుల క్రయ విక్రయాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**టపాసులు కొనడం.. అమ్మడం నిషేధం :**

కోవిడ్ నియంత్రణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈఏడాది బాణసంచా కొనడం, అమ్మడం, వినియోగించడం నిషేధించామని నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ పేర్కొన్నారు. ఈనెల 10న ఆయన నెల్లూరులోని తన ఛాంబర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ టపాసులు కాల్చడం వల్ల శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యంతో పాటు పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. ప్రజలంతా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ దీపాలు వెలిగించి దీపావళిని సంతోషంగా, ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

## రెవెన్యూ అసోసియేషన్..
# కొత్త కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు ఈనెల 8న కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర నాయకుడు చొప్పా రవీంద్రబాబు తదితర నాయకుల సమక్షంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నెల్లూరు అర్బన్ తహశీల్దారు జె.మనోహర్‌బాబు అధ్యక్షునిగా, తోటపల్లి గూడూరు తహశీల్దార్ పఠాన్ అజ్మతుల్లాఖాన్ అసోసియేట్ అధ్యక్షునిగా, ఆత్మకూరు ఎల్‌ఎంఎస్ పాయింట్ డిప్యూటీ తహశీల్దార్ డివి శేషయ్య, వరికుంటపాడు డిప్యూటీ తహశీల్దార్ చేవూరు శ్రీనివాసులు ఉపాధ్యక్షులుగా, ఆత్మకూరు విఆర్‌ఓ ఎస్ కృష్ణయ్య జిల్లా కార్యదర్శిగా, కోవూరు విఆర్‌ఓ ఎం.నాగేశ్వరరావు ఆర్గనైజింగ్ సెక్రటరీగా, షేక్ సిరాజ్, మేరగ రమేష్, ఎం.రాజశేఖర్, ప్రవీణ్‌కాంత్ సంయుక్త కార్యదర్శులుగా, ఇంద్ర రవీంద్ర కోశాధికారిగా ఎంపికయ్యారు. గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం, సహాయకుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సామాన్యులపై
# భారం మోపుతున్న కేంద్రం
**- సిపిఎం విమర్శ**

కేంద్రప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ, పేద ప్రజలు, సామాన్య ప్రజానీకంపై భారం మోపుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ విమర్శించారు. నెల్లూరు వేదాయపాళెంలోని సిపిఎం రూరల్‌కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9న జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసించాలని పిలుపునిచ్చారు. సిపిఎం రూరల్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

**Please note the change**
**www.lawyerteluguweekly.com**
is now
**www.lawyerpatrika.com**

## 26న దేశవ్యాప్త సమ్మెను
# జయప్రదం చేయండి
**- ఏఐటియుసి నాయకుల పిలుపు**

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటియుసి జిల్లాకార్యదర్శి దామా అంకయ్య పిలుపునిచ్చారు. ఈనెల 8న నెల్లూరు సంతపేటలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం విధానాలను నిరసించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలను సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆంజనేయులు, జాన్, నాగేంద్ర, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంవిఐలకు
# డిటిసి అభినందన

ఏపి రవాణాశాఖ సాంకేతిక అధికారుల అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా రవాణా అధికారులకు చోటు లభించడంతో జిల్లా రవాణాశాఖ అధికారి సుబ్బారావు వారిని అభినందించారు. ఇటీవల విజయవాడలో జరిగిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కావలి ఎంవిఐ ఎం.బాలమురళీకృష్ణ, కోఆర్డినేటర్‌గా గూడూరు ఎంవిఐ మురళీమోహన్ ఎన్నికయ్యారు. జోన్-3 అధ్యక్షుడిగా గూడూరు ఎంవిఐ రాఘవరావు, కార్యదర్శిగా భాస్కర్‌రావు ఎన్నికయ్యారు. వీరంతా డిటిసిని ఈనెల 9న గౌరవపూర్వకంగా కలవగా వారందరినీ ఆయన అభినందించారు.

# వృద్ధులకు బులియన్ మర్చంట్స్ పింఛన్లు



నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న పలువురు వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న అసోసియేషన్ కల్యాణమండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంతపేట సిఐ అన్వర్‌బాషా ముఖ్యఅతిథిగా పాల్గొని వ్యాపారుల సేవలను అభినందించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంపి ఆంజనేయులు, ప్రోగ్రామ్ ఛైర్మెన్ ఎం.చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ సి.లక్ష్మీనారాయణ, కె.సతీష్ బాబు, శ్రీనివాసరావు, ఎన్.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల దీక్షలు

ఏపి విద్యుత్ ఉద్యోగుల జేఏసి ఆధ్వర్యంలో నెల్లూరులోని విద్యుత్ భవన్ ఎదుట ఈనెల 9న ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జేఏసి నాయకులు మాట్లాడుతూ లాక్‌డౌన్ సమయంలో విద్యుత్ ఉద్యోగులు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారని, అయితే యాజమాన్యం జీతాలు మాత్రమే చెల్లించి అలవెన్స్‌లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా బారిన పడిన ఉద్యోగులకు పూర్తిగా మెడికల్ బిల్లులు చెల్లించాలని, కార్మికులకు 50 లక్షల రూపాయల కరోనా బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జేఏసి నాయకులు శ్రీనివాసులు, జాకీర్ హుస్సేన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. డి.ఇఇ రమణాదేవి, అనిల్‌కుమార్‌లు పాల్గొని ఈ దీక్షలను ప్రారంభించారు. మాజీఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, విశ్రాంత ఏఏఒ అమరలింగన్ సంఘీభావం తెలిపారు. పరశురాం, రామకృష్ణ, శ్రీనివాసులు, మురళి, హనుమ, రమేష్‌లు దీక్ష చేపట్టారు.

## పిఎన్ఎం కాలేజీ ప్రిన్సిపాల్‌గా
# శివరామ్‌ప్రసాద్

నెల్లూరు మూలాపేటలోని పిఎన్ఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇఎస్ఆర్ఎం మునిసిపల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరామ్‌ప్రసాదును బదిలీ చేస్తూ కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. పుర సేవ ఇన్‌చార్జి రాజేంద్రను విఆర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న కళాశాల ఇన్‌చార్జిగా బదిలీ చేశారు.

# బీసీ గణన చేపట్టాలి

బీసీల అభివృద్ధి కోసం బీసీల గణన చేపట్టాలంటూ ఏపి బీసీ చైతన్యసమితి అధ్యక్ష కార్యదర్శులు బత్తల రమణయ్య, వాసు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై వారు ఈనెల9న నెల్లూరు కలెక్టరేట్‌లోని డిఆర్‌ఓ రమణకు వినతిపత్రం అందజేశారు.



# ముఖ్యమంత్రిని కలిసిన బీఎంఆర్

వైయస్సార్సీపి నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు ఈనెల 9న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో కలిశారు. జిల్లాలోని దగదర్తి మండలం దామవరం వద్ద విమానాశ్రయం పనులను ప్రారంభించాలని బీఎంఆర్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. జిల్లాకు సంబంధించిన పలు అంశాలను సిఎంతో చర్చించారు.

# మాట తప్పని.. మడమ తిప్పని సిఎం జగన్

### ఎమ్మెల్యే మేకపాటి

మాట తప్పని, మడమ తిప్పని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కొనియాడారు. ఈనెల 8న ఆయన ఉదయగిరి నియోజకవర్గంలోని సీతారామపురం మండలంలో ఉన్న చిన్ననాగంపల్లి, పబ్బులేటుపల్లి గ్రామ పంచాయతీల్లో మూడవ రోజు పాదయాత్రలో పాల్గొని మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్‌రెడ్డి తన ప్రజాసంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేరుస్తున్నారని, ప్రజల సంక్షేమం కోసం దేశంలోనే ఎక్కడాలేని విధంగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రజల కష్టాలు తీరుస్తున్నారన్నారు. త్వరలోనే ఈ ప్రాంతానికి వెలిగొండ ప్రాజెక్టును కూడా తీసుకువస్తామన్నారు. గత టిడిపి పాలనలో చంద్రబాబు నిధులు స్వాహాచేయడమే తప్ప ప్రజల అభ్యున్నతిని ఏనాడూ పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు చింతరెడ్డి సుబ్బారెడ్డి, పద్మావతమ్మ, అల్లూరి రాజు, కల్లూరు జనార్దన్‌రెడ్డి, బసిరెడ్డి కృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుధాకర్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# వెంకటగిరిలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం



### నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో విద్యార్థులకు వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు వెంకటగిరిలో త్వరలోనే ఒక నైపుణ్యాభివృద్ధి కేంద్రం (స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్) ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని వైకాపా తిరుపతి, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 10న ఆయన వెంకటగిరిలోని తన నివాసంలో ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్వరరావుతో సమావేశమయ్యారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో విద్యారంగంలో సమూల మార్పులు తెచ్చేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని విద్యార్థులకు వృత్తి విద్యలో మరింత నైపుణ్యం ఉండేందుకు ఈ కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నారని, ఇందులో భాగంగా వెంకటగిరిలో అయిదెకరాల స్థలంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని భావిస్తున్నామన్నారు. ఇక్కడ ఆ కేంద్రం ఏర్పాటుకు సహకరిస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డికి, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ చల్లా మధుసూదన్‌రెడ్డిలకు ఆయన తన కృతజ్ఞతలు తెలిపారు.

# శతావధాని శ్రీనివాసులుకు ప్రతిష్టాత్మక పురస్కారం



నెల్లూరు నగరానికి చెందిన శతావధాని, సంస్కృతాంధ్ర కవి పండితుడు సూరం శ్రీనివాసులు ఈనెల 10న ప్రతిష్టాత్మకమైన సిపి బ్రౌన్ సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. బెంగళూరులోని శ్రీకృష్ణదేవరాయ కళామందిరంలో ఇడమకంటి లక్ష్మీరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆచార్య ఎంఆర్ దొరస్వామి, కళారత్న ఏ.రాధాకృష్ణ, ఆచార్య కె.ఆశాజ్యోతి, డాక్టర్ తూమాటి సంజీవరావు తదితరులు పాల్గొని శ్రీనివాసులును ఘనంగా సత్కరించి పురస్కారం ప్రదానం చేశారు.

# 8.10 లక్షల ఎకరాలకు సాగునీళ్ళు

### - జిల్లా సాగునీటి సలహా మండలి నిర్ణయం




జిల్లాలో 2020-21 సీజన్‌కు సంబంధించి మొదటి పంట రబీకి 8.10 లక్షల ఎకరాలకు సాగునీళ్ళందించేందుకు జిల్లా సాగునీటి సలహా మండలి తీర్మానించింది. మంత్రులు డా. అనిల్‌కుమార్ యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్‌ల ఆధ్వర్యంలో ఈనెల 9న నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన సలహా మండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర జలవనరుల మంత్రి డా.పి.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా జిల్లాలో ప్రతి ఎకరాకి సాగునీళ్ళందిస్తామని స్పష్టం చేశారు. వ్యవసాయానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అన్నీ ఇచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ ఏడాది రికార్డుస్థాయిలో కండలేరు, సోమశిల జలాశయాలు పూర్తిస్థాయి సామర్థ్యంతో ఉన్నాయని, సోమశిల ప్రాజెక్టు పరిధిలోని పెన్నా డెల్టాకు 2.47 లక్షల ఎకరాల ఆయకట్టుకు, కనుపూరు కాలువ కింద 66వేల ఎకరాలకు, కావలి కాలువ కింద 1.24 లక్షల ఎకరాలకు, జికెఎన్ కలువ కింద 72వేల ఎకరాలకు దక్షిణ కాలువ కింద 42 వేల ఎకరాలకు, మొత్తంగా డెల్టాకు 5.51 లక్షల ఎకరాలకు 55.10 టిఎంసిల నీటిని కేటాయించినట్లు చెప్పారు. తెలుగు గంగ కింద 2.44 లక్షల ఎకరాలకు, కండలేరు పరిధిలో 2.22 లక్షల ఎకరాలతో పాటు చిత్తూరుజిల్లాలోని 22,500 ఎకరాలకు కూడా నీరు ఇవ్వనున్నామన్నారు.

మంత్రి గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ రైతాంగ సంక్షేమమే రాష్ట్రప్రభుత్వ ధ్యేయమని, రైతుల వద్దకే అన్ని పథకాలు చేరవయ్యేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని చెప్పారు. జిల్లాలో రెండో పంటకు సంబంధించి 3.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వెలగపల్లి ప్రసాద్‌రావు, డిసిసిబి ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వ్యవసాయ సలహామండలి ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పెరిగిన ధరలపై 'తెలుగు మహిళ'ల ఆందోళన

నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరిగిపోతుండడంతో పేదలు, మధ్యతరగతి కుటుంబాల వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ధరలు తగ్గించాలని కోరుతూ టిడిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈనెల 9న నెల్లూరు నగరంలోని ఏసి కూరగాయల మార్కెట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ధరలు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని, అన్న క్యాంటీన్లు మూతేసి పేదలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు మహిళ నాయకులు విజయమ్మ, రేవతి, బివి లక్ష్మి, రోజారాణి, వాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని 52 కళాశాలలకు నోటీసులు

జిల్లాలో నిబంధనలు పాటించని 52 ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలకు ఈనెల 9న ఇంటర్‌బోర్డు షోకాజ్ నోటీసులు జారీచేసింది. రేకుల షెడ్లలోను, షాపింగ్ కాంప్లెక్సులపైన కళాశాలల నిర్వహణపై బోర్డు అభ్యంతరాలు తెలిపింది. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన కళాశాలలకు నోటీసులు జారీ చేశామని, పదిరోజుల్లో వారు వివరణ ఇవ్వాలని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ ధ్యేయం

### - కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న



రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. వైయస్ జగన్ ప్రజా సంకల్పయాత్రకు మూడేళ్ళు పూర్తయిన సందర్భంగా ఆయన బుచ్చిరెడ్డిపాళెంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుకు పెద్ద పీట వేస్తోందన్నారు. కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట, విడవలూరు మండలాల మధ్య పెన్నా వారధిపై సబ్‌మెర్సిబుల్ కాజ్‌వే నిర్మాణానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి 93 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారని ఆయన చెప్పారు. బుచ్చిరెడ్డిపాళెం అభివృద్ధికి అన్నివిధాలా కృషి చేస్తున్నామన్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆఫ్కాఫ్ ఛైర్మెన్ కొండూరు అనిల్‌బాబు, డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, డిఏఏసి ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, బొందిలి కార్పొరేషన్ ఛైర్మెన్ కిశోర్‌సింగ్, పవ్వేరు బ్యాంకు ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్‌పై ఆరోపణలు ఒట్టివే

### కలెక్టర్‌కు త్రిసభ్య కమిటీ నివేదిక - ఆర్డీఓ వెల్లడి

నెల్లూరు రెడ్‌క్రాస్‌లో ప్లాస్మా అమ్మకాల్లో అక్రమాలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలన్నీ అవాస్తవాలేనని ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ వెల్లడించారు. అక్కడ రికార్డుల నిర్వహణ అంతా సక్రమంగానే ఉందని త్రిసభ్య కమిటీ విచారణలో తేలిందని, ఈ విషయాన్ని తాము కలెక్టర్‌కు విన్నవించామని కూడా చెప్పారు. ఈనెల 10న నెల్లూరులోని తన ఛాంబర్‌లో త్రిసభ్య కమిటీలోని మరో ఇద్దరు సభ్యులు, రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మెన్ ప్రకాష్‌బాబు, సొసైటీ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు సిహెచ్ వెంకటేశ్వరరెడ్డితో కలిసి ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ విషయం చెప్పారు. కలెక్టర్ తదుపరి చర్యలు తీసుకునేందుకు రెడ్‌క్రాస్ సంస్థ తరఫున ఉండే క్రమశిక్షణ సంఘానికి నివేదించాలని తమ కమిటీ సిఫార్సు చేసిందన్నారు. నిరాధారమైన ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు సిఫారసు చేశామన్నారు.

తమ కమిటీ నెల్లూరు శాఖను పలుసార్లు సందర్శించి రికార్డులు పరిశీలించిందని, ఈ శాఖ ఛైర్మెన్‌తో పాటు ఇతర సభ్యులను కూడా విచారించామని, ప్రతి రక్తదాత ఫోన్ నంబరు, వారి వివరాలతో పాటు ఏరోజు ఏ సమయంలో వారి నుంచి ప్లాస్మా తీసుకున్నారనే వివరాలను నమోదు చేశారని, సంబంధిత ఆసుపత్రులు, వైద్యుల అభ్యర్థనల ఆధారంగానే ప్లాస్మా ఇచ్చారని ఆయన వివరించారు. ఆయా వివరాలను వారు రికార్డుల్లో నమోదు చేశారని చెప్పారు.

# పెరిగిన ప్రతిష్ఠ

(మొదటి పేజీ తరువాయి)

***కరోనా నేపథ్యంలో దాదాపు 11 నెలల విరామం తర్వాత ఈనెల 7వ తేదిన శ్రీహరికోట నుంచి జరిగిన పిఎస్ఎల్వి-సి49 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో ఒక్క షార్‌లోనే కాదు..దేశమంతా ఒక్కసారిగా సంతోషం పెల్లుబికింది.***

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన రాకెట్ ప్రయోగం విజయవంతమై భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కీర్తి మరోసారి ప్రపంచం నలుదెసలా రెపరెపలాడింది. పిఎస్ఎల్వి-సి49 రాకెట్ ప్రయోగం దిగ్విజయం కావడంతో ఇస్రో మరో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నట్లయింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి అనుకున్న ప్రకారం పిఎస్ఎల్వి సి-49 రాకెట్ నింగిలోకి విజయవంతంగా దూసుకువెళ్ళింది. కరోనా కష్టకాలంలోనూ మన శాస్త్రవేత్తలు అన్నిరకాలైన ఇబ్బందులను ఎంతో పట్టుదలతో అధిగమించి, అపారమైన తమ ప్రజ్ఞాపాటవాలతో ఈ రాకెట్ ప్రయోగాన్ని విజయవంతం చేయడం అభినందనీయం. 630 కిలోల బరువు కలిగిన 10 ఉపగ్రహాలను 575 కిలోమీటర్ల ఎత్తులో అంతరిక్ష కక్ష్యలో ప్రవేశపెట్టడంలో ఇస్రో శాస్త్రవేత్తలు విజయం సాధించడంతో దేశమంతటా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇందులో మన దేశ అవసరాలకు సంబంధించిన రిమోట్ సెన్సింగ్ ఎర్త్ అబ్సర్వేషన్ శాటిలైట్ (ఇఓఎస్-01) అనే ఉపగ్రహం కూడా ఉంది. ఈ ఉపగ్రహంలో ఉన్న శక్తివంతమైన కెమెరాల ద్వారా మనదేశంలోని రైతులకు ఉపయోగపడే వ్యవసాయ సంబంధిత అంశాలపై పూర్తి స్థాయి సమాచారం లభిస్తుంది. ముందుగా నిర్ణయించుకున్న కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3 గంటల 2 నిమిషాలకు ఈ రాకెట్‌ను ప్రయోగించాల్సి ఉండగా వాతావరణం అనుకూలించకపోవడంతో 9 నిమిషాలు ఆలస్యంగా 3.11 గంటలకు ప్రయోగించినప్పటికీ రాకెట్ జయప్రదంగా కక్ష్యలోకి దూసుకుపోయింది.

### ఒకేసారి విజయవంతంగా నింగిలోకి..10 ఉపగ్రహాలు :

ఈ రాకెట్‌లో మన ఉపగ్రహం ఇఓఎస్-01తో పాటు లిథువేనియాకు చెందిన ఆర్-2 ఉపగ్రహం, లక్సెంబర్గ్‌కు చెందిన 4 ఉపగ్రహాలు, అమెరికాకు చెందిన మరో 4 ఉపగ్రహాలు మొత్తం 10 ఉపగ్రహాలు నింగిలోకి దూసుకువెళ్ళాయి. నిర్ణీత సమయంలోనే ఒకదాని తర్వాత మరొకటిగా నిర్ణీత కక్ష్యల్లోకి వెళ్ళి..మొత్తం 19 నిమిషాల్లోనే ఈ ప్రయోగం పూర్తికావడంతో దేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఇస్రో విజయం పట్ల అభినందనలు వెల్లువెత్తాయి. గత ఏడాది డిసెంబర్ 11న జరిగిన పిఎస్ఎల్వి సి-48 ప్రయోగం తర్వాత మళ్ళీ సుమారు 11 నెలలకి షార్ నుంచి రాకెట్ ప్రయోగం జరగడంతో ప్రజలందరూ ఎంతో ఆసక్తిగా ఈ ప్రయోగాన్ని టీవీల్లో వీక్షించారు. కోవిడ్ నిబంధనలకు లోబడి అతితక్కువ మంది శాస్త్రవేత్తలు రేయింబవళ్ళు శ్రమించి ఈ రాకెట్‌ను సిద్ధం చేయడం, విజయవంతంగా ప్రయోగించడం ఇస్రో శాస్త్రవేత్తల ప్రతిభాపాటవాలకు నిదర్శనం. ప్రధాని మోడీతో పాటు రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తదితర ప్రముఖులంతా ఈ ప్రయోగ విజయంపై సంతోషం వ్యక్తం చేస్తూ ఇస్రో శాస్త్రవేత్తలతో పాటు ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న అందరినీ అభినందించారు.

### త్వరలో మరిన్ని రాకెట్ ప్రయోగాలు - ఇస్రో ఛైర్మెన్ శివన్

ఇదొక ప్రత్యేకమైన ప్రయోగమని, కరోనా విజృంభణ తర్వాత జరగిన మొదట ప్రయోగం కావడంతో ఈ విజయాన్ని మరిచిపోలేమని ప్రయోగం అనంతరం ఇస్రో ఛైర్మెన్ డాక్టర్ శివన్ పేర్కొన్నారు. రాకెట్ ప్రయోగ విజయానికి కారణమైన ప్రతిఒక్కరిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. శాస్త్రవేత్తలు, ఉద్యోగులు అందరూ ఈ కరోనా కష్టకాలంలో కూడాఎంతో ధైర్యంగా ముందుకు వచ్చి, ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరిస్తూ రాకెట్ ప్రయోగాన్ని విజయవంతం చేశారని కొనియాడారు. ఈ విజయం తనకెంతో సంతోషంగా ఉందని, ఈ స్ఫూర్తితో మరిన్ని రాకెట్ ప్రయోగాలకు సిద్ధం అవుతామన్నారు. త్వరలోనే షార్ నుంచి పిఎస్ఎల్వి సి-50 రాకెట్ ద్వారా సిఎంఎస్ 01 ఉపగ్రహాన్ని కూడా ప్రయోగిస్తామన్నారు. అంతేకాదు ఇస్రో కొత్తగా రూపొందిస్తున్న స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వి) సీరీస్‌లోనూ తొలి ప్రయోగం జరుపుతామని, ఇఓయస్-02, 03 ఉపగ్రహాలను కూడా త్వరలోనే అంతరిక్షంలోకి పంపేందుకు కృషిచేస్తామని చెప్పారు.

Please note the change

www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com



ఈ నెల 10వ తేదీ గూడూరు శ్రీ వీరభద్రస్వామి గుడి అన్నదాన ట్రస్ట్ సభ్యులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వైయస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఆయన అభిమానులు.

# ఆక్రమిస్తే.. కఠిన చర్యలే!

## - మున్సిపల్ కమిషనర్ ఓబులేసు





## డివిజన్ గూడూరు వార్తలు

గూడూరు మున్సిపాలిటీలో ఇటీవల కాలంలో చెన్నూరు, దివిపాలెం, చిల్లకూరు, నెల్లటూరు గ్రామాలు విలీనం కావడంతో కొంతమంది స్వార్ధపరులు ప్రభుత్వ భూములు ఆక్రమణ చేసి కట్టడాలు కట్టడం హేయమైన చర్య అని గూడూరు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇటీవల గూడూరు పురపాలక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ ఓబులేసు మాట్లాడుతూ గూడూరు పురపాలక పరిధిలో ప్రభుత్వ భూములను ఆక్రమించి కట్టడాలు చేపడితే వెంటనే వాటిని కూల్చడం జరుగుతుందని హెచ్చరించాడు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములను ఆక్రమణ చేస్తే వెంటనే వారిపై మున్సిపాలిటీ అధికారులు కేసులు నమోదు చేసి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆయన తెలిపాడు. గూడూరు పట్టణంలోని రాజావీధిలో రూ. 30 లక్షల నిధులతో డ్రైనేజీ, సిమెంటురోడ్ల నిర్మాణానికి త్వరలో 40లక్షల నిధులు మంజూరవుతాయని వెల్లడించాడు.

## పట్టపగలే ఇళ్ళను దోచే..

# గజదొంగ అరెస్ట్



గూడూరు రూరల్ సి.ఐ శ్రీనివాసులురెడ్డికి నగదు రివార్డును అందజేస్తున్న ఎస్పీ భాస్కర్‌భూషణ్

పట్టపగలే ఇళ్ళను దోచే గజదొంగ చిగురుపాటి పరుశురాంను తమ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారని ఇటీవల నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ వెల్లడించారు.

వివరాలలోకి వెళితే... ఇటీవల సైదాపురం మండలం అనంతమడుగు గ్రామంలో ఒక ఇంట్లో జరిగిన దొంగతనం కేసు దర్యాప్తులో భాగంగా జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ ఆదేశాల మేరకు గూడూరు డిఎస్పీ ఎం.రాజగోపాల్‌రెడ్డి సూచనలతో పగటిపూట ఇళ్ళలో దొంగతనం చేసే అంతరాష్ట్ర గజదొంగ చిత్తూరుజిల్లాకు చెందిన చిగురుపాటి పరుశురాంని గూడూరు గ్రామీణ సి.ఐ శ్రీనివాసులురెడ్డి, గూడూరు, వెంకటగిరి సి.ఐలు, సైదాపురం, గూడూరు గ్రామీణ ఎస్సైలు ఒక బృందంగా ఏర్పడి ఇటీవల నారాయణ ఇంజనీరింగ్ కళాశాల వద్ద వెళుతుండగా ఆ నిందితుడిని పట్టుకున్నారు. విచారణలో సైదాపురం, గూడూరు గ్రామీణం, డక్కిలి, వెంకటగిరి, బాలాయపల్లి మండాలల్లో ఏడుకుపైగా దొంగతనాలు చేసినట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి రూ.15లక్షలు విలువైన 316 గ్రాముల బంగారు ఆభరణాలు, 2 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై 37 కేసులు నమోదు అయ్యాయి. నిందితుడిపై ఎర్రచందనం అక్రమ రవాణా కేసు కూడా ఉన్నట్లు తెలిసింది. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనపరచిన గూడూరు గ్రామీణ సి.ఐ శ్రీనివాసులురెడ్డి, వెంకటగిరి సి.ఐ ఎన్.నాగమల్లేశ్వర రావు, సైదాపురం ఎస్సై ఎం.శివశంకర్, గూడూరు గ్రామీణ ఎస్సై జి.పుల్లారావు, హెడ్‌కానిస్టేబుల్స్ రాజు, సుబ్రహ్మణ్యం, చిరంజీవులు, కానిస్టేబుళ్ళు వేణు, పవన్, ఆదినారాయణ, విష్ణు, షకీల్‌లను ఎస్పీ అభినందించి, నగదు రివార్డులను అందజేశాడు. సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటరత్నం పాల్గొన్నారు.

## రోటరీ హెల్ప్‌ఏజ్ పల సరుకుల పంపిణీ



గూడూరు సొసైటీ మఠం వీధిలోని అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ భవన్‌లో ప్రతి నెలా జరిగే పల సరుకుల పంపిణీ కార్యక్రమం ఈ నెల 10వ తేదీ జరిగింది. ఆదిశేషారెడ్డి రోటరీ హెల్ప్‌ఏజ్ మేనేజింగ్ ట్రస్టీ పి.జానకిరాంరెడ్డి, రోటరీ ప్రెసిడెంట్ జి.యస్.రాఘవరెడ్డి సూచనల మేరకు రొటేరియన్‌లు దశరథరామిరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, రోటరీ సెక్రటరీ బండి శ్రీదర్‌రెడ్డి పాల్గొని పల సరుకులను పంపిణీ చేశారు.

## యూటీఎఫ్ నాయకుల నిరసన ర్యాలీ

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ నెల 11వ తేదీ గూడూరు పట్టణంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గూడూరు యూటీఎఫ్ నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్.నవకోటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల పిఎఫ్, ఏపి జిఎల్ఐ నుండి కుటుంబ అవసరాల కొరకు దరఖాస్తు చేసుకున్నా లోన్ల చెల్లింపు జరగడం లేదని, రావాల్సిన జీతభత్యాలనే మరిచారని, వెంటనే ఆర్ధిక చెల్లింపులపై ఆంక్షలు తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నాడు.



## గర్భిణీ స్త్రీలకు

# జెవివి భోజనాలు

గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో, నెల్లూరు ఎల్ఐసిలో మేనేజర్‌గా పనిచేస్తున్న రవికుమార్ దాతృత్వంతో ఈ నెల 9వ తేదీ గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణీస్త్రీలకు డాక్టర్ ఉమా ద్వారా భోజనాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఉమా మాట్లాడుతూ జె.వి.వి.వారు సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను పోగొడుతూ, విద్యార్ధులలో సైన్స్ పట్ల అవగాహన పెంచుతూ, చెడు వ్యసనాలకు లోనుకావద్దని హెచ్చరిస్తూ మంచి సమాజం కోసం అహర్నిశలు పనిచేస్తూ అనేక సేవాకార్యక్రమాలు చేస్తున్నారని, మా ఆసుపత్రికి వచ్చే నిరుపేద గర్భిణిస్త్రీలకు గత నాలుగు సంవత్సరాలనుండి భోజనాలు పంపిణీ చేస్తున్నారని, కరోనా సమయంలో కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో జె.వి.వి. సభ్యులు రక్తదానం చేశారని, వారి సేవలకు తమ ఆసుపత్రి సిబ్బంది తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, రామమోహన్, మనోహర్ గౌడ్, పురుషోత్తమరావు, వెంకట్, శంకర్, శ్రీను, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని పథకాలకంటే.. ఆరోగ్యశ్రీ ఎంతో గొప్పది

**- ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి**






రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలన్నిటికన్నా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఎంతో గొప్పదని, ఎంతోమంది నిరుపేదలకు, నిస్సహాయులకు ఏ మాత్రం ఖర్చు లేకుండా వారి ఆరోగ్యం కోసం ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 10న ముఖ్యమంత్రి తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి నెల్లూరుజిల్లాతో సహా పలు జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలోని శ్రీకాకుళం, తూర్పు గోదావరి, కృష్ణా, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఆరోగ్యశ్రీ అమల్లో ఉందని, మిగిలిన జిల్లాలకు కూడా ఈ పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ఆసుపత్రిలో వెయ్యి రూపాయల బిల్లు దాటితే వైయస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యచికిత్స అందించేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యే దాకా అన్ని ఖర్చులను ఈ పథకం కింద ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కోవిడ్ నష్టాలు ఎన్ని ఉన్నా, ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నా ఈ పథకానికి సంబంధించిన నిధులను సమకూర్చామని, ఇప్పటిదాకా 2200 వ్యాధులకు వర్తిస్తున్న ఆరోగ్యశ్రీ పథకంలోకి మరో 234 వ్యాధులను కూడా చేర్చి మొత్తంగా 2434 వ్యాధుల నివారణకు ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 95 శాతం మంది ప్రజలను ఆరోగ్యశ్రీ పథకం కిందకు తీసుకువచ్చామని, అన్ని ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు 3 వేల నుంచి 10వేల రూపాయల దాకా పింఛను అందిస్తున్నామన్నారు. ప్రజలకు మరింతగా సేవలందించేందుకు రాష్ట్రంలోని ప్రాథమిక ఆసుపత్రుల రూపురేఖలన్నీ మార్చి అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామ, వార్డు, సెక్రటేరియట్ పరిధిలో ఆరోగ్యమిత్ర కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి ఆరోగ్యశ్రీ పథకం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

## జిల్లాలో 57వేల కుటుంబాలకు లబ్ధి - కలెక్టర్

జిల్లాలో జూన్ 2వతేది నుంచి ఇప్పటి దాకా ఆరోగ్యశ్రీ పథకం కింద 134 కోట్ల రూపాయలను ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెల్లించామని, తద్వారా 57 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరిందని ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రజలకు చేరువచేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని విధాలా తగు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, జేసీ డా.ప్రభాకర్‌రెడ్డి, డిఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త చంద్రశేఖర్, కిమ్స్ ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# పోలేరమ్మ అమ్మవారికి శాకాంబరి అలంకారం

మండల కేంద్రమైన మనుబోలులోని కోదండరామపురం దేవాంగకాలనీలో కొలువుదీరి ఉన్న పోలేరమ్మ అమ్మవారికి ఈనెల 8న శోభాయమానంగా శాకాంబరి అలంకారం నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. భక్తులు భాగవతుల హనుమంతరావు, లక్ష్మమ్మ దంపతులు ఈ వేడుకకు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

**Please note the change**

www.lawyerteluguweekly.com

is now

**www.lawyerpatrika.com**

# జనం మెచ్చిన నాయకుడు.. జగనన్న

**- సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**



రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి జనం మెచ్చిన నాయకుడని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. వైయస్ జగన్ ప్రజా సంకల్పయాత్ర మూడు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈనెల 8న ఆయన పెళ్ళకూరు మండలంలోని శిరసనంబేడు గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఒకవైపు ఆర్థికసంక్షోభం, మరోవైపు కరోనాతో అవస్తలు పడుతున్నప్పటికీ ప్రజలకు ఏమాత్రం కొదవలేకుండా సంక్షేమ పథకాలను అందిస్తుండడం ఎంతో హర్షదాయకమన్నారు. అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలని, అందుకు అనుగుణంగా పరిపాలన అందించాలని జగనన్న తపనపడుతున్నారన్నారు. వైయస్ జగన్ చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర దేశ చరిత్రలోనే ఒక చరిత్రాత్మకఘట్టంగా నిలిచిపోయిందన్నారు. పెళ్ళకూరు తదితర గ్రామాల సమస్యల పరిష్కారానికి తాము నిరంతరం కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు దువ్వూరు బాలచంద్రారెడ్డి, కట్టా సుధాకర్‌రెడ్డి, దబ్బల శ్రీమంత్‌రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, మారాబత్తిన సుధాకర్, మద్దాల సోమశేఖర్‌రెడ్డి, శిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డి, దువ్వూరు బాలచంద్రారెడ్డి, కట్టా రామలింగారెడ్డి, కట్టా వెంకటరమణారెడ్డి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# కావలి రెడ్‌క్రాస్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

కరోనా కష్టకాలంలో ఎనలేని సేవలందించిన కావలి రెడ్‌క్రాస్‌కు విశ్వగురు వరల్డ్ రికార్డుల సంస్థ 'కరోనా వారియర్స్' అవార్డునిచ్చింది. ఈ సందర్భంగా ఈనెల 8న కావలిలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్‌క్రాస్ అధ్యక్షుని హోదాలో అవార్డునందుకున్నారు. కావలి రెడ్‌క్రాస్ సేవలను ఆయన అభినందించారు. విశ్వగురు వరల్డ్ రికార్డుల సంస్థ వ్యవస్థాపకుడు సత్యవోలు రాంబాబు మాట్లాడుతూ కావలి రెడ్‌క్రాస్ సేవలకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందన్నారు. సినీ హీరో సుజిత్, శివాజీ యూత్ ఫౌండేషన్ భాస్కరనాయుడు, గోవిందరెడ్డి, రవిప్రకాష్, మురళీధర్‌రెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, మాల్యాద్రి, శ్రీహరిరెడ్డి, మాధవరెడ్డి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# కులమతాలకు అతీతంగా...కసుమూరు మస్తానయ్య దర్గా

***మత సామరస్యానికి ప్రతీకగా, కులమతాలకు అతీతంగా, భక్తుల కొంగు బంగారంగా ఉంటూ ఎంతోకాలం నుంచి అందరి పూజలందుకుంటున్న పరమ పవిత్రమైన, మహిమాన్వితమైన దర్గా.. కసుమూరులోని మస్తానయ్య దర్గా.***

***శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని వెంకటాచలం మండలంలో ఉన్న ఈ దర్గాకు దాదాపు రెండున్నర శతాబ్దాలకు పైగానే చరిత్ర ఉంది. మన జిల్లా నుంచే కాదు, మన రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా కసుమూరులో కొలువై ఉన్న సయ్యద్ హజరత్ కరిముల్లా షా చౌదరి ఉర్ఫ్ కాలేషా పీర్ మస్తాన్‌వలీ దర్గాను దర్శించుకునేందుకు భక్తజనం పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు.***



## మన దేవాలయాలు (20)

కసుమూరులోని మస్తాన్‌వలీ దర్గా అంటే అటు ముస్లిమ్ సోదరులకు, ఇటు హిందువులకు అందరికీ ఎంతో ప్రీతిపాత్రమైనది.. పవిత్రమైనది కూడా. జిల్లాలో ఇదెంతో ప్రఖ్యాతమైన ఆధ్యాత్మిక కేంద్రం. జిల్లా కేంద్రమైన నెల్లూరుకు సుమారు 24 కిలోమీటర్ల దూరంలో, మండల కేంద్రమైన వెంకటాచలంకు కేవలం 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న కసుమూరు గ్రామంలో వెలసిన ఈ దర్గా ఎంతోకాలంగా మతసామరస్యానికి ప్రతీకగా, సర్వమత సమ్మేళనంగా అందరి పూజలందుకుంటున్న మహిమాన్వితమైన దర్గాగా కసుమూరు మస్తానయ్య దర్గా ప్రసిద్ధిచెందింది.

### రెండున్నర శతాబ్దాలకు పైగానే ప్రఖ్యాతమైన దర్గా :

కసుమూరు దర్గాకు దాదాపు 275 సంవత్సరాల నాటి పురాతన చరిత్ర ఉంది. ఆ కాలంలో ఇరాక్‌లోని బాగ్దాద్ నగరంలోని ఫాతిమా-కరిముల్లా షా అనే పుణ్యదంపతులకు ఏకైక సంతానంగా మస్తాన్‌వలీ జన్మించారని, చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన మస్తాన్‌వలీ తన గురువు హజరత్ మహమ్మద్ సుబానిగౌస్ వద్ద శిష్యరికం చేసి అనేక దైవసంబంధిత విషయాలను తెలుసుకుని, తన 13వ ఏటనే దైవసందేశాన్ని వ్యాప్తి చేసి తద్వారా ప్రజలకు దైవానుగ్రహం కలిగించేందుకు మస్తాన్‌వలీ మన దేశానికి వచ్చారని తెలుస్తోంది. మస్తాన్‌వలీ మనదేశంలోని రాజస్థాన్‌లోనూ, కొంతకాలం కర్నాటకలోనూ ఉండి ఆ తర్వాత మన రాష్ట్రానికి చేరుకుని నెల్లూరులోని నవలాకులతోట ప్రాంతానికి వచ్చి ఇక్కడి ప్రజలకు దైవసందేశమిస్తూ, తన మహిమలతో ప్రజల వ్యాధులు, బాధలు తీరుస్తుండేవారని పెద్దలు చెప్తుంటారు. ఆ తర్వాత కొంతకాలానికి కసుమూరు గ్రామానికి వచ్చి గొర్రెల కాపరిగా జీవిస్తూ గ్రామం పక్కనే ఉండే కసుమూరు కొండపై నివసిస్తూ ఇక్కడి ప్రజలకు దైవసందేశం వినిపిస్తూ అందరికీ ఆరాధ్యులయ్యారని, తన మహిమలతో స్వస్థత పొందిన ప్రజలు అనేకమంది ఆయనను దైవదూతగా ఆరాధించేవారని, దీంతో స్వామివారి పేరు కూడా కసుమూరు మస్తానయ్యగా బాగా వ్యాప్తిలోకి వచ్చిందని చెప్తుంటారు. ఆ తర్వాత కొంతకాలానికి మస్తాన్‌వలీ గ్రామస్తులందరి సమక్షంలో సజీవసమాధి అయ్యారని, ప్రజలంతా ఆయన్ను దైవస్వరూపునిగా, మహా మహిమాన్వితమైన దైవదూతగా ఆరాధిస్తూ ఆనాటి నుంచి నేటి దాకా కులమతాలకు అతీతంగా నిత్యం పెద్దసంఖ్యలో భక్తులు ఈ దర్గాకు విచ్చేసి స్వామివారికి భక్తితో పూజలు చేస్తుంటారని భక్తులు చెప్తున్నారు.

### మహిమాన్వితం.. సఫా బావి :

దైవాంశసంభూతులైన మస్తాన్‌వలీ ఇక్కడికి చేరువలో ఉన్న వెంకటకృష్ణాపురం గ్రామంలోని బావిలో స్నానమాచరించేవారని, నేటికీ ఆ బావి ఎంతో మహిమాన్వితమైనదని భక్తులు భావిస్తుంటారు. ఈ బావిలో స్నానమాచరించి ఆ తర్వాత మస్తాన్‌వలీ దర్గాను దర్శించుకున్నవారికి కోరిన కోరికలు నెరవేరుతుంటాయి. మస్తానయ్య స్వామి అనుగ్రహం ఉంటే ఎంతటి దీర్ఘవ్యాధులైనా నయమవుతాయని, గాలిదోషాలు, గ్రహదోషాలు నివారణ అవుతాయని, సంతానం లేని వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. నేటికీ ఆ బావిలో ఎల్లప్పుడూ పుష్కలంగా నీరుండడం విశేషం. మస్తాన్‌వలీని భక్తితో ఆరాధించేవారు తమ మొక్కుబడులు చెల్లించుకుని తమ పిల్లలకు కూడా స్వామివారి పేరునే మస్తానయ్య అని, మస్తాన్, మస్తానమ్మ అని ఇలా పేర్లు పెట్టుకుంటూ ఉండడం కూడా తెలిసిందే.

### ప్రతి ఏటా వైభవంగా గంధ మహోత్సవాలు :

దేశవ్యాప్తంగా ఎంతోమంది భక్తులు ఎంతో పవిత్రంగా ఆరాధించే ఈ దర్గాలో సంప్రదాయబద్ధంగా ముజావర్ల ఆధ్వర్యంలో ప్రతిఏటా స్వామివారికి గంధమహోత్సవం ఘనంగా జరుగుతుంటుంది. ఎంతో మహిమాన్వితమైన దర్గాగా పేరొందిన కసుమూరు మస్తానయ్య దర్గా నెల్లూరుజిల్లా ఆధ్యాత్మిక రంగానికే ఒక వరం..అంతేకాదు జిల్లాకే గర్వకారణం కూడా.



ఎన్ని పార్టీలు మారినా...

# 'విజయ'ం లేదు... 'శాంతి' లేదు...!

● రాజకీయాలలో రాణించలేకపోతున్న రాములమ్మ

***ముందుగా బిజెపి ఆ తరువాత టిఆర్ఎస్, వెంటనే కాంగ్రెస్ ఇప్పుడు మళ్ళీ బిజెపి వైపు చూపు... ఇదీ మాజీ సినీనటి విజయశాంతి ప్రస్థానం. మర్చిపోయాం... ఈమధ్య ఆమె మళ్ళీ ఒక సినిమాలో నటించింది కాబట్టి మాజీ సినిమా నటి కాదులే.***

1980వ సంవత్సరం నుండి 40 సంవత్సరాలుగా సినీ పరిశ్రమలో ఉన్న ఆమె 22 సంవత్సరాల క్రితం అంటే 1998లో రాజకీయ ఆరంగేట్రం చేసింది. మధ్యలో 2009 నుండి 2014 వరకు 5 సంవత్సరాలపాటు మాత్రమే ఆమె పార్లమెంటు సభ్యురాలుగా ఉంది తప్పితే రాజకీయంగా పెద్దగా రాణించలేదు. వాస్తవానికి ఆమె 1996లోనే పాక్షిక రాజకీయ రంగప్రవేశం చేసి అప్పట్లో తమిళనాడులో భారతీయ జనతా పార్టీతో కలసి పోటీచేస్తుండిన ఏఐఏడియంకె పార్టీ తరఫున జయలలితకు మద్దతుగా స్టార్ కాంపైనర్గా క్రికెటర్ శ్రీకాంత్‌తో కలసి లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని విజయశాంతి నిర్వహించింది.

ఆ తరువాత 1998లో అధికారికంగా భారతీయ జనతా పార్టీలో చేరడంతోనే ఆ పార్టీ మహిళా విభాగం భారతీయ మహిళా మోర్చాకి ఆమెను కార్యదర్శిగా నియమించి 1999 ఎన్నికలలో ఆమెను ప్రచారానికి వాడుకున్నారు. ఒక దశలో సోనియాగాంధీపై కడప లోక్‌సభ అభ్యర్థిగా విజయశాంతిని నిలబెట్టాలనుకున్నప్పటికీ చివరి నిమిషంలో సోనియాగాంధీ కడప నుండి పోటీ చేయకపోవడంతో విజయశాంతి అభ్యర్థిత్వాన్ని కూడా భాజపా విరమించుకుంది.

## నెల్లూరు నుండే తొలి ప్రచారం...

భాజపా మహిళా మోర్చా కార్యదర్శి హోదాలో ఉమ్మడిరాష్ట్రంలో తొలి భారీ సభ నెల్లూరులోనే జరిగింది, విజయశాంతి ముఖం రాజకీయాలలో కొత్త కావడం, ఆమెకు లేడీ అమితాబ్‌గా మంచి ఇమేజ్ వుండడంతో నెల్లూరు సభ విజయవంతమై భాజపాలో ఆశలు రేపింది. ఆమెకు క్రమేణా సినిమాలు తగ్గడంతో 2004 నుండి పూర్తిస్థాయిలో రాజకీయాల పట్ల దృష్టి సారించి ప్రత్యేకరాష్ట్ర నినాదంతో 2009 జనవరిలో "తల్లి తెలంగాణా పార్టీ" స్థాపించి, పార్టీకి పెద్దగా ఆదరణ లభించకపోవడంతో నిరాశకు లోనైంది. తల్లి తెలంగాణాను అదే ఏడాది తెలంగాణా రాష్ట్ర సమితిలో విలీనం చేసి 2009 లో జరిగిన సాధారణ ఎన్నికలలో మెదక్ పార్లమెంటు నియోజక వర్గంనుండి టిఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచి పెద్దల సభలో అడుగుపెట్టింది. ఆ తరువాత చోటు చేసుకున్న అనేక నాటకీయ పరిణామాలతో 2011లో తెలంగాణా ఉద్యమంలో భాగంగా కేసిఆర్‌తో పాటు ఆమె కూడా తన పదవికి రాజీనామా చేసింది. అయితే ఆ రాజీనామాలు ఆమోదించబడలేదు.

2014 వరకు తెలంగాణ రాష్ట్ర సమితిలోనే కొనసాగిన రాములమ్మ కేసిఆర్‌తో విభేదించి తెలంగాణా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా కాంగ్రెస్ గూటికి చేరింది. 2014లో జరిగిన సాధారణ ఎన్నికలలో మెదక్ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయింది. ఆ తరువాత అడపాదడపా ప్రకటనలకే పరిమితమైపోయి పూర్తిగా రాజకీయాలకు దూరమైంది. 2018లో కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆమెను ఆ పార్టీ తెలంగాణా విభాగానికి స్టార్ కాంపైనర్గా నియమించ డమే కాకుండా ప్రచార కమిటీ సలహాదారు పదవి కూడా కట్టబెట్టాడు. కానీ ఆ ఎన్నికలలో కూడా విజయశాంతి పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. రాజ కీయాలకు దూరంగా ఉంటూ ఇటీవలే 'సరిలేరు నీకెవ్వరు' సినిమా ద్వారా చాన్నాళ్లకు మళ్ళీ తెరపై దర్శనమిచ్చింది. ఇప్పుడిక తనకెవ్వరూ సాటిలేరని అనుకుంటుంది కాబోలు మళ్ళీ రాజకీయాలపై ఓ కన్నేసింది, తాను రాజకీయ ఆరంగేట్రం చేసిన భారతీయ జనతా పార్టీలోనే త్వరలో మళ్ళీ చేరడానికి రంగం సిద్ధం చేసుకుంది.

వివిధ భాషల్లో 175కి పైగా సినిమాలు, నటిగా 40 సంవత్సరాల అనుభవం, 22 సంవత్సరాల రాజకీయ ప్రస్థానం, ఎన్నో చేదు అనుభవాలు, అనేక తీపి జ్ఞాపకాలు, రాజకీయంగా ఏదో సాధించాలనే తపన ఉన్న ఈ రాములమ్మకి రాజకీయంగా అనుకున్న 'విజయ'ం రావడంలేదు. మనసుకు 'శాంతి' కలగడం లేదు. వేచిచూద్దాం... మళ్ళీ భారతీయ జనతా పార్టీలో చేరి తీరని కోరికలేమైనా ఉంటే తీర్చుకుంటుందేమో.

## ఆరోగ్యశ్రీని బాగా అమలుచేయాలి

జిల్లాలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం సేవలను పటిష్టంగా అమలుచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 9న నెల్లూరులోని పెద్దాసుపత్రిలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ ఆరోగ్యమిత్రలు బాధ్యతగా సేవాభావంతో ఈ పథకం లబ్ధిదారులందరికీ చేరువయ్యేలా చూడాలన్నారు.





Dr C J Reddy, MS DNB (Surg)
Dr C R Reddy Hospital, GUDUR
Cordially inviting you to a
CME PROGRAM
LECTURE BY A WEBINAR (ZOOM) ON
DISEASES OF THYROID
by
Prof C M K Reddy
DSc FRCS (Glas & Ire)
General & Vascular Surgeon
Halsted Surgical Clinic & Apollo Hospitals, Chennai
Emeritus Professor, TN Dr MGR Medical University
President, TN Medical Practitioners' Association &
Indian Chapter, Royal College of Surgeons in Ireland
Dr B C Roy National Awardee as Eminent Medical Teacher



10.30 am, Sunday, 15th November 2020
11.30 am : Audience Interaction(Only Doctors Please)
Zoom Meeting ID : 869 9070 5111
Passcode : 760347
All Practitioners & PG students are welcome.
Entry free for all Doctors
All Doctors are Welcome
For Technical Assistance Please contact:
Mr N Nagabhushanam, ME
Phone : 095662 99886

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# మోడి ప్రభంజనం

(మొదటి పేజీ తరువాయి)

చూపించిన చౌరవ వంటి సంఘటనలూ భారతీయులను ఏ స్థాయిలో ప్రభావితం చేస్తున్నాయో చెప్పడానికి ఈ ఫలితాలే పెద్ద నిదర్శనం. రాబోయే రోజుల్లో భాజపా ప్రభంజనానికి ఎదురు లేదన్న విషయాన్ని ఈ ఫలితాలు చెప్పకనే చెప్తున్నాయి.

## కమలాన్ని బండెక్కించిన సంజయ్...

తెలంగాణలోని దుబ్బాక నియోజకవర్గంలో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారు. పదివేలతో తమ గెలుపు మొదలౌతుందనీ, మెజారిటీ ఎంత...? అని మాత్రమే ఆలోచించాలనే భ్రమల్లో ఉన్న టిఆర్‌యస్ పార్టీ నాయకులను ఓటర్లు ఖంగు తినిపించారు. అనూహ్యంగా ఇక్కడ కమలానికి పట్టం కట్టి కారు స్పీడుకి బ్రేకులు వేశారు. తెలంగాణా బిజెపి అధ్యక్షుడిగా బండి సంజయ్ పగ్గాలు చేపట్టిన నాటినుండి పార్టీకి మంచి గుర్తింపును తేవడంలో ఆయన తనదైన ముద్రను వేసుకున్నాడు. దుబ్బాక ఉపఎన్నిక ప్రక్రియ మొదలైన నాటినుండి రఘునందనరావు గెలుపుని సంజయ్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు, మితిమీరిన విశ్వాసంతో కారు పార్టీ చేసిన వ్యాఖ్యలు, ఒక దశలో ఓడిపోతామేమోననే భయంతో బిజెపి అభ్యర్థి ఇంట్లో పోలీసుల చేత డబ్బులు పెట్టించి ఆయనను అక్రమ కేసులో ఇరికించాలని చేసిన ప్రయత్నం కేసిఆర్ పార్టీని అప్రతిష్ఠపాలు చేసిందనికూడా అక్కడి వారి అభిప్రాయం. నైతిక విలువలు కలిగిన న్యాయవాదిగా, సౌమ్యుడిగా పేరున్న కమలం పార్టీ అభ్యర్థి రఘునందన్ రావు గతంలో రెండుసార్లు పోటీచేసి ఓడిపోయినప్పటికి ఎప్పుడూ ప్రజల్లో ఉంటూ మంచి గుర్తింపును తెచ్చుకున్నాడు. పాత్రికేయుడిగా అనుభవం కూడా ఉండడడంతో నియోజకవర్గ ఓటర్లకు బాగా దగ్గరయ్యాడు. ఏది ఏమైనా తెలంగాణలో అధికార పార్టీని కాదని కమలాన్ని 'బండి' ఎక్కించడంలో సంజయ్ పడ్డ శ్రమకి ఫలితం దక్కింది.

## మేధావులు, మీడియా బృందాల అంచనాలు తలక్రిందులయ్యాయి ...

తాము ఏం చెప్తే అదే జరుగుతుందని విర్రవీగే మీడియా బృందానికి చెంపపెట్టుగా ఈ ఉప ఎన్నికలలో వివిధ ప్రాంతాలలోని భారతీయ ఓటర్లు తీర్పు ఇచ్చారు. ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమ స్వార్ధ ప్రయోజనాలను, స్వలాభాల కోసం కొన్ని పార్టీలని ఆయా పార్టీల నాయకులను తమ భుజాలపై మోస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్న మీడియా సంస్థలకు బుద్ధి చెప్పేలా ఫలితాలను ఇచ్చారు. ఉదాహరణకు 2019 లో జరిగిన ఆంధ్రా ఎన్నికలలో 151సీట్లతో జగన్మోహన్‌రెడ్డికి పట్టం కట్టే స్థాయిలో ప్రజలు ఓట్లు వేస్తే వాస్తవాలను కప్పిపుచ్చి 110 సీట్లతో చంద్రబాబు మళ్ళీ అధికారంలోకి రాబోతున్నాడని కొన్ని చానళ్ళు, పత్రికలూ ఎగ్జిట్ పోల్ ఫలితాలను వెల్లడించాయి, వాస్తవాలు వీళ్ళకి తెలిసినప్పటికి వాటిని దాచిపెట్టి అబద్ధాలను పతాక శీర్షికలో ప్రచురించాయి. అదే తరహాలో ఈసారి అనేక పత్రికలూ, చానళ్లు బిజెపి బలహీనపడిందంటూ ప్రకటించి తప్పులో కాలేశాయి. అనేక మంది రాజకీయ విశ్లేషకులు కూడా ఈసారి బిజెపికి ఉన్న ప్రజాదరణని అంచనా వేయడంలో విఫలమయ్యాయి.

## సంబరాలు చేసుకుంటున్న కమలనాథులు

ఈ ఉప ఎన్నిక ఫలితాలతో దేశవ్యాప్తంగా ఉన్న భారతీయ జనతా పార్టీ అభిమానులు, కార్యకర్తలు పండుగ చేసుకుంటున్నారు. 4 రోజులు ముందుగానే దీపావళి వచ్చిందన్నంత ఆనందంగా సంబరాలు జరుపుకుంటున్నారు. భవిష్యత్తులో రాబోయే అన్ని ఎన్నికలలో నరేంద్ర మోడీ హవానే కొనసాగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో తమ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ అగ్ర నాయకత్వం పనిచేయాలని వాళ్ళు కోరుకుంటున్నారు. కాంగ్రెస్‌తో సహా ఇతర జాతీయ స్థాయి పార్టీలన్నీ తుడిచిపెట్టుకుపోతుండడంతో రాబోయే కాలంలో భారతదేశంలో అతిపెద్ద ఏకైక జాతీయపార్టీగా బిజెపి అవతరించబోతోందన్న ఆశాభావాన్ని వాళ్ళు వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

మొత్తం మీద ఈ ఉప ఎన్నికల ఫలితాలు కొత్త చరిత్రనే సృష్టించాయి. ముఖ్యంగా ఆంధ్రా వంటి రాష్ట్రంలో కాంగ్రెస్, తెలుగుదేశం వంటి పార్టీల్లో ఉండలేక, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీలో చేరడానికి మనసు రాక సందిగ్ధంలో ఉన్న నాయకగణంతో పాటు ప్రస్తుత వైసిపిలో ఇమడలేకపోతున్న వారికి సైతం ఒక వేదికను సూచించే విధంగా ఈ ఫలితాలు వెలువడ్డాయి... వేచి చూద్దాం.. ఏం జరగబోతోందో...!

# సర్వేపల్లి నెల్లూరుకే!

(మొదటి పేజీ తరువాయి)

అంతేకాకుండా రాష్ట్రంలో 25 లేదా 26 జిల్లాలకు బదులుగా 32 జిల్లాలు చేయబోతున్నారని, ఇందులో భాగంగా గూడూరు జిల్లా కేంద్రం కాబోతోందన్న గాలి వార్త కూడా ఇటీవల సామాజిక మాధ్యమాల్లో జోరుగా షికారు చేస్తోంది.

అయితే 'లాయర్' సేకరించిన విశ్వసనీయ సమాచారం ప్రకారం 25 లేదా 26 జిల్లాలకే పునర్విభజన ప్రక్రియ పరిమితం కాబోతుందని తెలిసింది. సర్వేపల్లిని నెల్లూరు జిల్లాలోనే ఉంచే విధంగా అధ్యయన కమిటీ ప్రతిపాదించిందని, ఈ ప్రతిపాదనకు దాదాపుగా ఆమోదముద్ర కూడా పడిందని సమాచారం. గుడ్డిలో మెల్లగా ఈ వార్త నెల్లూరీయులకు కొంత ఊరట కలిగించేదే. రాకెట్ కేంద్రం ఉన్న సూళ్లూరుపేట, ఖనిజ సంపద పుష్కలంగా ఉన్న గూడూరు, జరీ చీరలకు ప్రసిద్ధి చెందిన వెంకటగిరితో పాటు సుదీర్ఘ తీరప్రాంతం కలిగి కృష్ణపట్నం ఓడరేవుతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన సర్వేపల్లి కూడా వెళ్ళిపోయివుంటే జిల్లా అనాధగా మిగిలిపోయి ఉండేది. నెల్లూరీయుల మీద కొంతైనా దయ చూపించి సర్వేపల్లిని నెల్లూరు పరిధిలోనే ఉంచినందుకు అధ్యయన కమిటీకి ధన్యవాదాలు చెప్పాల్సిందే మరి.



# దివ్య దీపావళి

నరకుని పరిమార్చ నరక చతుర్దశి
అనుచును పిలుతురు అవని యందు
పెద్ద చిన్నలనెడి భేదమ్ము లేకుండ
జనులెల్ల చేతురు సంతసించి!...
ప్రతి ఇంటి ముంగిట ప్రమదలు ప్రమిదలు
వెలిగించ తిమిరమ్ము తొలగిపోవు
తీపి పదార్థముల్ తినుచుందురెల్లరు
ఇంటింటి పండుగ నెరుక సేయ!..
సిరులు పొందంగ శ్రీలక్ష్మి సేవలందు
పాల్గొనుచు సంతసింతురు భక్తజనులు
దుష్టుల దునిమి రక్షింప శిష్టవరుల
దివ్య దీపావళి వేవచ్చె దిశలు వెలుగ!..

**- గాజులపల్లి శివరామయ్య**
**ఫోన్ : 94411 43234**

వీక్షణం
- మంజీర

## యుగయుగాల సంప్రదాయం

# ఖండాంతరాల సంస్కృతి

దీపావళి వస్తోంది. సంబరాలు తెస్తోంది. తారాజువ్వలు, మతాబులు, చిచ్చుబుడ్లు, కాకరపూలు, భూచక్రాలు, విష్ణుచక్రాలు, రాకెట్‌లు, ఎర్ర టపాకాయలు, పెద్ద శబ్దం వచ్చే బాంబులు చెప్పుకుంటూ పోతే ఎన్నో. ఒకప్పుడు దివిటీలతో పిల్లలు గుంపుగా ఊరంతా తిరుగుతూ సందడి చేసేవాళ్లు. చిన్న పిల్లలకు దీపావళిని మించిన పెద్ద పండుగ మరొకటి ఉండదు. ఇది పెద్దవాళ్లను బాల్యంలోకి తీసుకెళ్లే పండుగ కూడా. ఈ దీపావళి పండుగకు దారి తీసిన పౌరాణిక కథనం ఉంది. ద్వాపరయుగంలో ప్రజలను బాధలకు గురిచేస్తున్న నరకాసురుడు అనే రాక్షసుడిని సంహరించడానికి ఉద్యుక్తుడవుతాడు శ్రీకృష్ణుడు. యుద్ధానికి సత్యభామ కూడా వెళ్తుంది. శ్రీకృష్ణుడు మూర్ఛపోవడంతో నరకాసురుడిని సత్యభామ సంహరిస్తుంది. అప్పటి వరకు గ్రామాల్లో ప్రజలు నరకాసురుడు దాడి చేస్తాడేమోననే భయంతో దీపాలు వెలిగించకుండా రాత్రిళ్లు చీకటిలోనే గడిపేవారు. నరకాసురుడి పీడ విరగడైందనే సంతోషంతో దీపాల వరుసలతో చీకటిని పారదోలి వెలుగుకు ఆహ్వానం పలికారు. వెలుగులను వేడుకగా మార్చడానికి బాణాసంచా దోహదం చేసింది. బాణాసంచా కాల్చడం అనే సంస్కృతి నరకాసురుని వధతోనే మొదలైందా? కాదు. శ్రీకృష్ణుడు-రుక్మిణి పెళ్లి వేడుకలో 'ఫూల్‌జాడీ (చిచ్చుబుడ్లు)'లు వెలిగించినట్లు 'రుక్మిణీ స్వయంవరం'లో ఏకనాథుడు రాశాడు.



## అరబ్బులు తెచ్చారా!

క్రీ.శ 1400 సంవత్సరంలో అరబ్బులు మందుగుండును చైనా నుంచి ఇండియాతోపాటు యూరప్‌కు కూడా తెచ్చారని జాక్ కెల్లీ అనే చరిత్రకారుడు చెప్పాడు. దసరా వేడుకల్లో భాగంగా మహర్నవమి రోజు క్రీ.శ 1443లో విజయనగర రాజు రెండవ దేవరాయలు స్వయంగా టపాకాయలను కాల్చేవాడు. గుజరాత్‌లో బ్రాహ్మణ వివాహ వేడుకల్లో బంధువులందరూ పాటలు, నాట్యాలతో పాటు రకరకాల బాణాసంచా కాలుస్తారని పర్యాటక సాహిత్యకారులు ఉదహరించారు. రాజస్థాన్‌లోని కోట వాసులకు దీపావళి నాలుగురోజుల వేడుక. నగరమంతా లక్షల దీపాలు వెలిగించేవాళ్లు. నగరం బయట రాజు స్వయంగా టపాకాయలతో లంకాదహనం నిర్వహించేవాడు. ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో దసరా ఉత్సవాలు నిర్వహించినట్లు అన్నమాట. అయితే ఇవన్నీ పర్యావరణానికి హాని కలిగించని వేడుకలుగానే మిగిలాయి. ఇంకా చెప్పాలంటే... వర్షాలతో పేరుకున్న మురికి మీద వృద్ధి చెందిన క్రిమికీటకాలను సంహరించడానికి దోహదం చేసేవి. ఇండియాలోకి భారీ మందుగుండు యుద్ధాలు రావడం, అదే మందుగుండును తేలికపాటి మోతాదులో వాడి పేలుడు మందుగుండును తయారు చేయడం అరబ్బుల నుంచే వచ్చినట్లు జాక్ కెల్లీ అధ్యయనం స్పష్టం చేస్తోంది. పదిహేడవ శతాబ్దంలో బీజాపూర్ పాలకుడు ఆదిల్ షా తన కూతురి పెళ్లి వేడుకలో టపాకాయల కోసమే 80 వేల రూపాయలు ఖర్చుచేశాడని చరిత్రకారుడు సతీశ్ చంద్ర రాశారు. పద్దెనిమిదవ శతాబ్దంలో అవ్వద్ పాలకుడు అసఫ్ ఉద్‌దౌలా కాల్చిన టపాకాయలతో ఆకాశం రంగురంగులుగా మారిపోయిందని అప్పటి సాహిత్యకారులు వర్ణించారు.

*ఓ ముప్పై ఏళ్ల కిందట టపాకాయల సంస్కృతి శృతి మించింది. గొప్పదనాల ప్రదర్శనగా మారిపోయింది. అది స్వాగతించాల్సిన విషయం ఏ మాత్రం కాదు. పర్యావరణ కార్యకర్తలు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి తెచ్చింది. పర్యావరణానికి హాని కలిగించని రీతిలో వేడుక చేసుకోవాలి. నిజమే... ఇందుకోసం దీపావళికి ఒక వారం ముందు నిద్రలేస్తే సరిపోదు. టపాకాయల పరిశ్రమను వ్యవస్థీకృతం చేయాలి. ఈ పరిశ్రమలో ఏ రకమైన పదార్థాలు ఉపయోగించాలనే నియమావళిని స్పష్టంగా రూపొందించాలి. కార్మికులకు ప్రమాదాల నుంచి రక్షణ కల్పించే పని వాతావరణాన్ని కూడా ఏర్పాటు చేయాలి. 'శివకాశిలో టపాకాయల పరిశ్రమలో పేలుడు, పదిమంది మరణం'అనే వార్తలు ఇక కనిపించనంత పటిష్టంగా చట్టాలను తీసుకురావాలి. పెద్ద శబ్దం రానివి, పర్యావరణాన్ని కలుషితం చేయని టపాకాయలకు మాత్రమే అనుమతినిస్తూ... ఎకో ఫ్రెండ్లీ బాణాసంచా వేడుకలుగా మలుచుకోవాలి.*

## అంబరాన్నంటే సంబరం

మనదేశం అనే కాదు, హిందువుల ఆచారం అనే కాదు, ప్రపంచంలో ఏ ఖండమైనా సరే... వేడుకను తారాస్థాయికి తీసుకెళ్లేది బాణాసంచానే. ఒకరు కొత్త సంవత్సరాదికి క్రాకర్స్ కాలుస్తారు. మరొకరు గెలుపును వెన్నముద్దల వెలుగులో ఆస్వాదిస్తారు. అమరులకు గౌరవచిహ్నంగా టపాకాయలు కాల్చి నివాళులర్పించే సంస్కృతి కొన్నిచోట్ల ఉంది. ఇంత విస్తృతమైన సంప్రదాయానికి మతం రంగులద్దడం శోచనీయం. దీపావళి రోజున పిల్లలు మతాలకతీతంగా మతాబులు కాలుస్తారు. ఆ కాంతిలో వారి ముఖాలు మతాబుల్లా వెలిగిపోతుంటాయి.

# పినాకిని గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట మండలం పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ ఆశ్రమంలో ఈనెల 8న సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ప్రముఖ సామాజిక కార్యకర్త పి.రమేష్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆశ్రమం కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, కమిటీ సభ్యులు కలసి ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు. తొలుత ఆశ్రమంలోని జాతిపిత మహాత్మాగాంధీజీ విగ్రహానికి, ఆశ్రమ నిర్మాణకర్త పొణకా కనకమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మహాత్మాగాంధీ గురించి 'పినాకిని తీరంలో మహాత్మాగాంధీ' అనే పుస్తకాన్ని రచించిన ఏనుగు శ్రీనివాసులురెడ్డి అకాలమరణానికి సంతాపం ప్రకటించారు. ఆశ్రమ కమిటీ సభ్యులు గంపల మంజుల, గ్రామస్తులు పాల్గొన్నారు.

Please note the change

www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# కోస్టల్ కారిడార్ ఏర్పాటుకు సన్నాహాలు

జిల్లాలోని కోట, చిల్లకూరు మండలాల్లోని తీరప్రాంతాల్లో త్వరలోనే 5,733 కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి. కోస్టల్ కారిడార్‌లో భాగంగా పరిశ్రమల ఏర్పాటుకు అధికారులకు సన్నాహాలు చేస్తున్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ నేపథ్యంలో 5733 కోట్ల రూపాయల పెట్టుబడులతో చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ హరేందిరప్రసాద్ తెలిపారు. ఈనెల 10న ఆయన చిల్లకూరు, కోట మండలాల సరిహద్దుల్లోని ఆక్వా పరిశ్రమల ఆవరణలో కోస్టల్ కారిడార్ భూసేకరణపై ప్రజాభిప్రాయం సేకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లోని తమ్మినపట్నం, బల్లవోలు, మోమిడి, కర్లపూడి, కొత్తపట్నం, చింతవరం పంచాయతీల్లో సుమారు 11వేల ఎకరాలను పరిశ్రమలకు కేటాయించి నార్త్ ఇండస్ట్రియల్ హబ్‌గా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.








ప్రథమ వర్ధంతి

మా ఇంటి దీపం, మా ఆరాధ్యదైవం
శ్రీమతి చిట్టమూరు అనసూయమ్మ(బుజ్జమ్మ) గారు
(లేట్. చిట్టమూరు పద్మనాభరెడ్డి గారి సతీమణి)
మాకు దూరమై నవంబర్ 19, 2020 నాటికి
ఏడాది పూర్తికానున్న సందర్భంగా
ఆ మానవతామూర్తిని సంస్మరించుకుంటూ..
ఆమె దివ్య ఆత్మకు మా స్మృత్యంజలి ఘటిస్తున్నాము.

తమ్ముడు / అల్లుడు - కుమార్తె
ప్రొ॥ సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై
కోడలు
డా॥ సి.భారతి, యు.యస్.ఏ
(W/o. లేట్. డా॥ సి.మధుసూదన్‌రెడ్డి)
మనుమరాలు, మనుమడు
ప్రణీత, లోహిత్, యు.యస్.ఏ
మనుమడు - మనుమరాలు
డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై
మనుమరాలు - మనుమడు
శ్రీమతి హారిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ
మునిమనుమలు మునిమనుమరాండ్రు
జయేష్ & అస్మిత    కీర్తన లక్ష్మి & తనవ్


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: lawyerpatrika@gmail.com